# భక్తిమాల

JANUARY 2006








# భక్తిమాల

## తెలుగు ఆధ్యాత్మిక మాసపత్రిక

పుష్పగుచ్ఛం 29 | జనవరి 2006 | పుష్పం 1





మజ్జన్మ జన్మాంతర సర్వకోటి
వ్యాప్తాపి యద్దృష్టిరహో పవిత్రా ।
పునాతి సర్వం నిజమార్గలగ్నం
గంగేవ తం శ్రీగురుదత్తమీడే ॥

(శ్రీదత్త ధ్యానమాలిక)

ఆ చూపు, ఆహా ఎంత పవిత్రమైనదో గానీ, నా (లాంటి నీచుడి) జన్మ జన్మాంతరాలలో గల మూల మూలన్నింటికీ పాకుతోంది. అయినా సరే (అది అపవిత్రం కాదు సరికదా) తన దారిలో తనకు తగిలిన ప్రతి దాన్నీ, గంగానది లాగా, పవిత్రం చేసేస్తోంది. ఆ చూపు శ్రీగురుదత్తదేవులది. ఆయనను స్తుతిస్తున్నాను.

సంస్థాపకులు
శ్రీదత్తపీఠాధిపతి
శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ

ముక్తికన్యా వివాహేచ్ఛా
యద్యస్తి తవమానసే।
ఆత్మాలంకరణార్థాయ
భక్తిమాలాం గలే ధర॥

తాత్పర్యం
ముక్తికన్య నిన్ను వరించాలంటే భక్తిమాలతో నిన్ను అలంకరించుకో.

సంపాదకులు
శ్రీకుప్పావేంకట కృష్ణమూర్తి

# భక్తిమాల

**శ్రీ భక్తిమాల ట్రస్టు (రి),**

**శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమము**

దత్తనగర్, మైసూరు - 570 025, ఫోన్ : 0821 - 2486486,2480424,

ఫ్యాక్స్ : 0821 - 2487487.

ఇంటర్నెట్ : http://dattapeetham.com,Email:mail@dattapeetham.com

Bhaktimala Email :
subscription_bhaktimala@dattapeetham.com: For Informaiton regarding Subcription, effecting change of your mailing address etc.


**స్టాఫ్ కరెస్పాండెంట్ : శ్రీ వి. సుదర్శన్‌రెడ్డి**

## ఈ సంచికలో............


| | |
|---|---|
| శ్రీదత్త ధ్యానమాలిక | 01 |
| సంపాదకీయం | 04 |
| అమృత బిందువు | 07 |
| సూక్తిమంజరి (కష్టాలు ఎందుకు - దిద్దుబాటు) | 08 |
| ఉగాది శ్రీస్వామీజీవారి నూతన సంవత్సర సందేశం | 14 |
| పిల్లలూ, మీకు ఏమి తెలుసా? | 18 |
| ఆత్మవాదము | 21 |
| యోగవాసిష్ఠ హృదయము | 25 |
| శ్రీస్వామీజీ చరిత్ర | 27 |
| ఈ మాసంలో మన పర్వాలు | 30 |
| భజగోవిందం | 33 |
| అనుభవాలు | 36 |
| ఆహారాలలో ఆయుర్వేద చికిత్స | 39 |
| సంక్షిప్తవార్తలు | 41 |
| శ్రీస్వామీజీవారి పర్యటనా పట్టిక | 45 |


## ఫోటోల వివరాలు

ముఖచిత్రం : దత్తజయంతిరోజు, దత్తాత్రేయస్వామి సన్నిధిలో శ్రీస్వామీజీ.

వెనుక అట్టపై: మేకెదాటు ఆశ్రమంలో ది. 18. 12. 2005 నాడు దత్త దేవాలయానికి పునఃకుంభాభిషేకాన్ని నిర్వహిస్తున్న శ్రీస్వామీజీ.

(1) దత్తజయంతి ఉత్సవాలలో శ్రీస్వామీజీవారి సుభాషితాల కన్నడ అనువాద పుస్తకం "జ్ఞానదెడెగె" ఆవిష్కరణానంతరం రచయిత్రి శ్రీమతి సుధావిశ్వేశ్వరయ్యగారిని ప్రసాదంతో అనుగ్రహిస్తున్న శ్రీస్వామీజీ.

(2) దత్తజయంతి ఉత్సవాలలో విశ్వప్రార్థనామందిరంలోని దత్త దేవాలయం ముందు ఆసీనులైన శ్రీస్వామీజీ. (17 వ పేజీ చూడండి)


చందా వివరములు : - 2 సం॥లకు రూ॥150/-, 5 సం॥లకు రూ॥ 350/-
దాతలు రూ॥ 2000/- పోషకులు రూ॥ 5000/- , రాజ పోషకులు రూ॥10,000,
విదేశీయులకు 1సం॥కు - 25 U.S. Dollors జీవిత సభ్యత్వం - 350 U.S. Dollors



ప్రకటన వివరములు : - శ్రీస్వామీజీ ఫోటోతో పూర్తిపేజి రూ॥ 5000,
స్వామీజీ ఫోటో లేకుండా పూర్తిపేజి రూ॥ 4,500. సగం పేజి రూ॥ 2500,పావు పేజి రూ॥ 1300.
పెండ్లి & ఇతర ఆశీస్సులకు రూ॥ 600.

**పాఠకులకు, చందాదారులకు, అభిమానులకు, పోషకులకు**

# ఆంగ్ల సంవత్సరాది

మరియు

# సంక్రాంతి శుభాకాంక్షలు







ఆర్థిక పుష్టికి తగు ని
స్స్వార్థత పరమార్థమౌచు, సకలాగమ భ
వ్యార్థము నావిష్కృతమై,
పార్థివ సంక్రాంతి మీకు పంచుత శుభముల్ ॥

# సంపాదకీయం



మాన్య గురు బంధువులారా!........జయగురుదత్త

మరో సారి మకర చక్రం తిరిగింది!

మరో క్యాలండరు మారింది!

మరో ఉత్సాహపు తరంగం పొంగింది!

కాని, నిజంగా ఏమి మారింది మనలో, మన జీవితంలో, మన ప్రపంచంలో?

మంచి మాటలు పరులకు బోధిస్తున్నాం, మనం మరచి పోతున్నాం! పక్కింటివాడి సంపద చూసి, మన సొంత ఇంటి ఊసు మానేసి, ఎటో పరుగులు తీస్తున్నాం. దేన్ని చూసి పరుగెడుతున్నామో అది మనకి ఎంతో కొంత అందుతోంది. కాని, ఈ లోగా మన కోసం మన తాత ముత్తాతలు దాచి పెట్టిన మహా నిధులు కనుమరుగైపోతున్నాయి. ఐనా సరే, పట్టించుకోవడం లేదు, పరుగాపడం లేదు, మనం! "టాల్‌స్టాయ్" చెప్పినట్లుగా మనకు ఆరడుగుల నేలే మిగులుతోంది, చివరికి.

కాని, మన తాత ముత్తాతలు పాతాళం నుంచి బ్రహ్మలోకం దాకా ఏకాతపత్ర సామ్రాజ్యాన్ని మనకు అప్పజెప్పాలని ఆశపడి, ఎక్కడెక్కడో నిధులు పాతి, వాటి ప్లానుల పత్రాలను మనింట్లోనే పెట్టి వెళ్ళిపోయారు.

మనం ఇల్లు వదలి చాలా దూరం పరిగెత్తేశాం. ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే, మన లోగిళ్లే కాదు, ఇంటి కప్పులు కూడా ధూళిలో మునిగిపోయి ఉన్నాయి. ఆ పాత పత్రాలు చిరిగి, తలో ముక్కగా వారికీ, వారికీ, దొరుకుతున్నాయి. అదృష్టం వున్నవాడికి మంచి ముక్కలు కొంతవరకయినా నిండుగా దొరుకుతున్నాయి. వాడు వాటిని మెచ్చుకుంటున్నాడు! మిగిలిన వాళ్లు దొరికిన అరకొర ముక్కలను చూసి వెటకారపు నవ్వులు నవ్వుతున్నారు!!

కొందరు పెద్దలు ఈ అపహాస్యాలను తట్టుకోలేక, తమకు దొరికిన వేదాంత పత్రఖండాలతో, కనిపించినవన్నీ ముడి పెట్టేద్దామని తపన పడిపోతున్నారు. ఈ తపనవల్ల జ్ఞాన పత్రాలకూ, విజ్ఞాన పత్రాలకూ పోటీ పెరిగిపోయి, పరస్పరం చిటపట లాడుకుంటున్నాయి.

ఈ దశలో గురుదేవులు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీవారు ప్రపంచం నలుమూలలా మానవ సమాజాల ప్రవృత్తి భేదాలను గుర్తిస్తూ, తాను సమన్వయ సారథిగా స్వయంగా సంచరిస్తూ, తన దూతగా "భక్తిమాల" అనే చిట్టి పొట్టి పలుకుల చిన్నారిని ప్రతి నెలా మన ఇళ్లకు పంపుతున్నారు. మనం గూడా ఈ చిన్నారిని మన ఇంటి ఆడపడచుగా ఆదరిస్తున్నాం. ఈ చిన్నారి మనకూ శ్రీ స్వామీజీకీ మధ్య ఒక వారధిగా, సేవధిగా వ్యవహరిస్తూ, ప్రపంచంలో ఎక్కడో ఏ మూలో శ్రీ స్వామీజీ పలికిన ప్రతి పలుకునూ, కలకండ పలుకులుగా మన కందిస్తోంది.

ఐతే శ్రీ స్వామీజీవారి కలకండ పలుకుల వెనుక, సముద్రాలను మించిన ఆలోచనాగాంభీర్యం వుంది. ఆ గాంభీర్యంలో, మన తాత ముత్తాతల నాటి పాత నిధుల మ్యాపులన్నీ మెరపుగీతల్లా కదలిపోతున్నాయి. ఆ మెరపుల ఒరవులను సుస్థిరం చెయ్యటం కోసమే శ్రీ స్వామీజీ ప్రేరణ, SERVE (Scientific Research on Vedas) అనే సంస్థను ఆవిర్భవింపజేసి, దాని ద్వారా వేదాలలోనూ , వేదానంతర కాలీన పురాతన భారతీయ వాఙ్మయంలోనూ, కాలపు పొరలలోనూ, కూరుకుపోయి, మరపునా, మరగునా, పడిపోయిన విజ్ఞాన శాఖలను వెదికి, వెలికి తీసి, మానవాళికి సంతర్పణ చేసి, ప్రకృతి మైత్రికీ, వాతావరణ సమతౌల్యానికీ, ఊపిరులూదాలని ప్రయత్నిస్తోంది.

పైకి ఎంత సులభులుగా కనిపిస్తారో, అందుకోబోతే అంత దూరపు మెరపు శ్రీ స్వామీజీ! పైకి ఎంత తేలికగా వినిపిస్తాయో, ఆలోచించిన కొద్దీ అంత లోతులు శ్రీ స్వామీజీ మాటలు! శ్రీ స్వామీజీలో ఇవి ఇలా

రెండు రకాల తలాలుగా, స్తరాలుగా (planes గా) సమంగా, సమకాలీనంగా , సమాంతరంగా, సాగిపోతూ వుండటం భక్తులందరికీ అనుభవంలో వున్న విషయమే! ఆ రెండు స్తరాలకీ ప్రతీకలే భక్తిమాల పత్రిక........సర్ఫ్ సంస్థ!! ఈ రెండూ మనకు రెండు కళ్లు!!!

మన కళ్లకు ఈ మకర సంక్రాంతి కొత్త కాంతుల నందిస్తుందని ఆశిద్దాం.

"మ" అంటే ఐదు. ఐదింటిని కలిగించేది "మ-కరం". పంచభూతాలు, పంచకోశాలు, పంచప్రాణాలు, పంచజ్ఞానేంద్రియాలు, ఇలా ప్రపంచం అంతా "పంచ" మీద ఆధారపడి నడుస్తోంది.

ఐదు కోణాలే ఐదు చేతులుగా (మ-కరం-గా) రూపొందిన నక్షత్ర చిహ్నమే జీసను జన్మను మేధావులకు సూచించింది! ఈ నక్షత్రమే ముస్లిం భక్తులకు ఆరాధ్య సంకేతమైంది! ఈ మకరమే సూర్యుడి గమనాన్ని క్రిందినుంచి ఉత్తరానికి (పైకి) మళ్ళించి, భారతీయ మహర్షులకు పూజనీయమవుతోంది!

గురుదేవులు శ్రీ స్వామీజీవారి అనుగ్రహం, దత్తభక్తులందరి హృదయ మందిరాలలోనూ మకరజ్యోతి వెలుగులను చిందించాలనీ, భక్తిమాల పలుకులనూ, సర్ఫ్ సంస్థ పరిశోధనలనూ, ప్రపంచానికి పంచాలనీ, ఇలాంటి సువిశాల సంతర్పణకు ఈ పార్థివ (2006) సంక్రాంతి శుభద్వారం కావాలనీ,

భక్తిమాల చేతులు జోడించి గురుదేవులను ప్రార్థిస్తోంది,
పాఠక పరమాత్మలకు ప్రణామాలర్పిస్తోంది.
మకర సంక్రాంతి శుభాకాంక్షలతో ........

జయగురుదత్త



## ఇంటి నిధి

ముష్టిలో గూడా, ఎవరి శైలి వారిదే!

ఆ ముష్టి వాడి "స్టైల్" మరీ ధాటిగా వుంది!

ఎత్తుగా వున్న పాత ఇనప పెట్టెమీద కూర్చుని, డబ్బా దమ దమా మోగిస్తూ, వచ్చే పోయే భక్తుల దృష్టిని తెగ ఆకర్షించేస్తున్నాడు.

చూసి చూసి , ఒక రోజు ఏకాంతంలో "గురుదేవా! మీ విజయంలో గల రహస్యమేమిటో చెబితే గానీ ఈ కాళ్ళు వదలను" అన్నాడో శిష్యుడు.

ముష్టిగురువు పొంగిపోయాడు. గర్వంగా మరోసారి తన డబ్బా మోగించి " ఈ పాత డబ్బాయే మన విజయ రహస్యంరా, శిష్యా" అన్నాడు.

"ఈ డబ్బాలో ఏముంది, గురుదేవా?"

"నాకు తెలీదు"

"ఇదెక్కడిది?"

"తరతరాలుగా మా ఇంట్లో వుంది"

"మీ తండ్రి తాతలందరూ ఈ డబ్బాను ఇలానే ఆసనంగా చేసుకొని....."

"అదేం లేదు. నేనే దీని ఉపయోగం కనిపెట్టా! నీ మీది ప్రేమతో రహస్యం చెప్తున్నా, విను. ఈ ఇనప పెట్టె తరతరాలుగా మా ఇంట్లో వుంది. దీని తాళం చెవి ఎటు పోయిందో నాకు తెలీదు. మావాళ్లెవరూ దీన్ని పట్టించుకోలేదు. వాళ్ళంతా ముష్టివిద్యలో పేరులే. కాని, నేను పొట్టి వాడ్నవటంచేత, ఈ విద్యలో అంతగా పైకి రాలేక పోయాను. ఆ రద్దీలో నన్నెవరూ గుర్తించటం లేదు. అప్పుడు నేనే ఆలోచించి, ఈ పాత పెట్టె ఇంట్లో పడి వుంది గదా అని, దీన్ని తెచ్చి, దీని మీదెక్కి కూర్చుని, డబ్బా మోగించటం మొదలు పెట్టాను. ఇక నా కీర్తికి తిరుగు లేదు.

కనుక, శిష్యా! నీవు గూడా ఒక పాత ఇనప పెట్టె సంపాదించుకో. నీకు ముష్టివిద్య వశమైపోతుంది".

"కాని గురుదేవా! ఆ పెట్టెలో ఏముందో, ఏమిటో....."

"నోరుముయ్, వెధవా! అధిక ప్రసంగం చెయ్యకు. దాంట్లో ఏం వుంటే మనకెందుకు? చెప్పినట్టు చెయ్యి".

శిష్యుడు భయపడి పోయాడు. గురువు నిద్దర పోయాడు.

మర్నాడు లేచేసరికి శిష్యుడు కనిపించలేదు.

"ఛీ! ఈ రోజుల్లో శిష్యులింతే" అనుకున్నాడు గురువు.

ఓ నెల రోజులైనాక, ఓ కొత్త పెద్ద మనిషి పెద్ద కార్లో వచ్చి, ముష్టివాళ్ళకు రూపాయి బిళ్లలు వేసుకుంటూ కొండమీదికి వెళుతున్నాడు. ఈ డబ్బా ముష్టివాడికి మాత్రం ఏమీ వెయ్యలేదు. "వాడికి వెయ్యరేమి?" అంది భార్య!

"అరవకు! మనింట్లో వున్న రవ్వలన్నీ ఆ పెట్టె పగుల గొట్టినపుడు దొరికినవే. ఈ దేశంవాళ్లంతా ఇంతే. వీళ్లకు ఇంట్లో వున్న నిధులు నచ్చవు" అంటూనే భార్యా భర్తలిద్దరూ గబగబా ముందుకు వెళ్లిపోయారు!




## తప్పులు ఎంచుట - దిద్దుట

**కదాచిదీషత్ చ్యుత సత్పథోపి**
**శుభానుభావశ్శుభమేవ యాతి ।**
**క్వచిత్తు వక్రోపి నదీప్రవాహో**
**జనోపకారీ జలధిం సమేతి ॥**

**(తాత్పర్యం: శుభమైన (స్వచ్ఛమైన) స్వభావం కలవాడు, ఎప్పుడో ఒకసారి కొంచెం దారి తప్పినా, చివరికి శుభాలనే పొందుతాడు. నదీ ప్రవాహం ఒకోసారి వంకరలు తిరిగినా, అది దారి అంతటా జనులకు ఉపకారాలు చేస్తూ, చివరకు సముద్రాన్ని చేరనే చేరుతుంది.)**

"తప్పులెంచువారు తమ తప్పు లెరుగరు" అన్నాడు వేమన.

అయితే ఉపాధ్యాయుడు విద్యార్థి చేసిన తప్పులను ఎత్తి చూపించరాదా? అలా అనేటట్లైతే, లోకంలో పెద్దలు పిల్లలకు మార్గదర్శనం చేసే వ్యవస్థే మిగలదు.

ఐతే, వేమన చెప్పినది తప్పేనా?

ఆయన తప్పు చెప్పలేదు. మనం తప్పుగా అర్థం చేసుకున్నాం. ఏలాగంటారా? వినండి.

తప్పులెన్నడం వేరు, తప్పు దిద్దడం వేరు! ఒక ఉదాహరణ తీసుకుందాం.

మనింటి పక్కవాళ్ళు కొంచెం మోటు మనుషులు. పైగా పలుకుబడి కలవారు. వాళ్ల కార్లను ఎప్పుడూ మన వాకిటికి అడ్డంగా పార్కు చేస్తూ ఉంటారు. మనం సర్దుకు పోతున్నాం.

ఒకరోజున మన పిల్లవాడు పని తొందరలో వాళ్ల కార్ల ముందర తన స్కూటరు నిలిపి ఇంట్లోకి వచ్చాడు. ఇంతలో వాళ్ల కారు కదలవలసి వచ్చింది. దానికి స్కూటరు అడ్డం వచ్చింది. దాంతో వాళ్లకి కోపం వచ్చి, మన పిల్లవాడ్ని పిలిచి "నీకు civic sense లేదు" అంటూ కొట్టబోయారు. మనం వెంటనే రంగంలోకి దూకి, కొట్లాట ఆపవలసి వచ్చింది. ఆ సమయంలో మనం వాళ్ల నోళ్లు మూయించటం కోసం, "రోజూ మీరు మీ కార్లను ఎక్కడ పార్కు చేస్తున్నారు? ఇప్పుడు మీ కారు ఎవరి ఇంటి ముందు వుంది? ఇది civic senseనా?" అని అడిగాం.

ఇక్కడ మనం ఎదుటివాడి తప్పు ఎంచి చూపిస్తున్నాం. ఇదీ, ఉపాధ్యాయుడు విద్యార్థుల తప్పులు ఎంచి చూపేది, రెండూ ఒకే రకమైనవా?

కావు.

ఎందుకని?

ఎందుకంటే, మన వుద్దేశ్యం పక్కవాడ్ని బాగు చేద్దామనీ కాదు, బాగు చేయగలమనీ కాదు. ఆ సమయానికి అలా వాడి తప్పు పైకెత్తి పెద్దది చేసి చూపిస్తే వాడు ప్రస్తుతానికి నోరు మూస్తాడని మన ఆశ. ఎప్పటినుంచో తిట్టాలనుకుంటున్న తిట్లు, కొంత నాజూకుగా అయినా, బయటకు తిట్ట గలిగినందుకు అదో రకమైన తృప్తి. సంగ్రహంగా చెప్పుకోవాలంటే, అప్పటి మన మానసిక పరిస్థితి అది.

ఇక ఉపాధ్యాయుడి దగ్గరికి వస్తే, అతని మానసిక పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. అతనికి విద్యార్థి నోరు మూయించడం లక్ష్యం కాదు. వాడు ఈ తప్పు మరోసారి చెయ్యకుండా మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకోవడమే అతని లక్ష్యం. పైగా అది అతని బాధ్యత, అతని ధర్మం. అందుకే ఈ రెండు ఉదాహరణలూ ఒకే జాతివి కావడానికి వీలు లేదు.

మనం పక్కింటివాడి నోరు మూయించేటప్పుడు, కొంచెం ఆత్మరక్షణ అనే అవసరమైనా మనకు ఉంది. ఒకోసారి ఇతరుల దోషాలను, బలహీనతలను, నలుగురిలోనూ విప్పి చెప్పి, అదంతా ఒక హాస్యంగా మనకి మనమే పొంగిపోతూ ఉంటాం. మరికొన్ని సందర్భాల్లో తండ్రిమీద కోపంతో కొడుకునో, కోడలిమీద కోపంతో అత్తనో, నిలబెట్టి, లేనిపోని తప్పులు కూడా అంటగట్టి, ఎప్పటెప్పటి సంఘటనలో తిరగతోడి, కడిగిపారేస్తూ ఉంటాం. దీంట్లో మన ఉద్దేశం ఏమిటి? మనం సాధిస్తున్న దేమిటి? మనకు ఒప్పుకో బుద్ధి కాదు కాని, మన ఉద్దేశ్యంలో ఉన్నది పగ ! మనం సాధిస్తున్నది విరోధ వృద్ధి! అక్కడితో ఆగిపోలేదు. మన ఆరోగ్యానికీ, ఆయుష్యానికీ, క్షయాన్ని కూడా మనం సాధించుకుంటున్నాం. " తన కోపమె తన శత్రువు అని " సుమతీ శతకంలో ఊరకే అన్నాడా?!

వేమనయోగి చెప్పింది ఈ రకపు "తప్పులెంచటం" గురించే. నిజానికి తప్పులెంచడం అంటే ఇదే. ఉపాధ్యాయుడు చేసేది తప్పుదిద్దడం.

ఇంతకూ తేలిందేమిటంటే, తప్పు దిద్దడం వేరు, తప్పులెన్నడం వేరు– అని.

వేమనయోగి ఇతరుల తప్పులను ఎంచవద్దన్నాడు. మరి మనలోనే తప్పులుంటేనో? వాటిని ఎంచి ప్రయోజనం లేదు, గుర్తించాలి, వాటిని పోగొట్టుకోవాలని ప్రయత్నించాలి.

"మరి, ఇతరులలో తప్పులున్నాయని మనం గుర్తించినప్పుడు వాటిని ఎంచకూడదంటున్నారు కదా! మనం వాళ్లతో ఎలా ప్రవర్తించాలి?"

ఈ ప్రశ్నకు సమాధానం ఆ తప్పుకు వెనుకాల ఉన్న పరిస్థితులమీద ఆధారపడి ఉంటుంది. మానవ స్వభావం ఏమిటంటే, తన తప్పులు చాలా మటుకు తనకు తెలుసు. వాటి వెనుకాల ఉన్న పరిస్థితులు కూడా తెలుసు. అందువల్ల, తన తప్పులు తనకు చాలా చిన్నవిగా కనిపిస్తూ ఉంటాయి. కొన్ని సార్లు అవి అసలు తప్పులే కావు అనిపిస్తుంది. ఒక్కోసారి ఒకే పని, తను చేస్తే ఒప్పనిపిస్తుంది, ఇతరులు చేస్తే తప్పనిపిస్తుంది.

కాని, ఏదో కారణంచేత ప్రసిద్ధిలోకి వచ్చినవాళ్ల జీవిత విశేషాలు ప్రజలకు ఎక్కువగా తెలుస్తూ ఉంటాయి, వాటిల్లో వాళ్లు చేసిన తప్పులమీద ప్రజల మనస్సులు ఎక్కువ సేపు నిలబడుతూ ఉంటాయి. "ఇంతటి తప్పు చేసినవాడు అంతటి గొప్ప స్థితికి ఎలా వెళ్లాడు?"– అని ఒకటే గుంజాటన కలుగుతూ ఉంటుంది.

ఇది సామాన్యుల మాట మాత్రమే. సీతాదేవి వంటి ఉత్తమ జీవులు మాత్రం, రావాణాసురుడి వంటి క్రూరుల విషయంలో కూడా **"న కశ్చి న్నాపరాధ్యతి"** (తప్పు చెయ్యని వాళ్లెవరుంటారీ ప్రపంచంలో)– అని దయ తలుస్తానే వుంటారు.

"సామాన్య మానవులకు ఉండే అనుమానపు చూపు తప్పా? అతి సాధువులకు ఉండే ఈ మెతక తనం తప్పా?" – అని అనేక మంది సాధకులు ఆలోచనలలో గిలగిలా కొట్టుకుంటూ ఉంటారు. అలాంటివారి కోసమే ఈ సూక్తి దీపం లాగా ముందుకొస్తోంది. "ఎదుటివారి తప్పులను మాత్రమే కాదయ్యా, వాళ్ల హృదయాల్లో ఉండే సంస్కారాలను కూడా గమనించడం నేర్చుకో" అని చెపుతోంది. ఆ మాట చెప్పడం కోసమే అనుభావము అనే పదాన్ని ప్రయోగిస్తోంది. **"శుభ్రానుభావః "** అంటోంది.

ప్రభావము అన్నా, అనుభావము అన్నా ఇంచు మించు ఒక్కటే. ప్రతి వ్యక్తిలోనూ అంతర్గతంగా ఒక ప్రభావం వుంటుంది. అది సరిగ్గా ఉంటే, ఆ

వ్యక్తి ఒకప్పుడు పొరపాట్లు చేసినా, వాడు తన తప్పులను తాను చూసుకో గలుగుతాడు, గుర్తించుకో గలుగుతాడు, ఒప్పుకో గలుగుతాడు, దిద్దుకో గలుగుతాడు. నువ్వు వాడి తప్పును గుర్తించే సమయంలో, వాడి అనుభవాన్ని కూడా గుర్తించ గలిగితే, వాడి భవిష్యత్ పరిస్థితి ఎలా ఉండగలదో రేఖామాత్రంగా అయినా నీ ఊహకు అందగలదు.

ఈ విషయం అర్థం కావడానికి సుకన్య చరిత్రే మంచి ఉదాహరణ.

సుకన్య మంచి వయస్సు పొంగులో ఉన్న రాజకుమారి. ఒట్టి రాజకుమారి కాదు, రాక్షసరాజకుమారి. ఒకసారి అడవిలో సరదాగా తిరిగి వద్దామని చెలికత్తెలతో కలసి షికారుకి వెళ్లింది. అక్కడ ఒక పుట్ట లోంచి ఏదో దీపకాంతి లాగా కనిపించింది. రాజపుత్రి కదా! నిర్భయంగా పుట్ట దగ్గరికి వెళ్ళి, ఆ కన్నంలోకి పుల్ల పెట్టి గట్టిగా పొడిచింది. వెలుతురు ఆగిపోయింది. నెత్తురు బయటికి వచ్చింది. రాజకుమారి 'హిహిహీ' అనుకుంటూ ఇంటికి వెళ్ళి పోయింది.

తీరా ఇంటికి వెళ్ళేసరికి, ఊళ్ళో ఏ ఒక్కరికీ మూత్రకోశాలు పనిచేయడం లేదు. ఎందుకిలా జరుగుతోందో అర్థం కాక రాజు, మంత్రులు, అధికారులు, అందరూ బెంబేలు పడిపోతున్నారు. రాజకుమారికి కూడా ఆదుర్దా కలిగింది. ఎందుకైనా మంచిదని అడవిలో పుట్ట దగ్గర జరిగిన వింత సంఘటనను తండ్రికి చెప్పింది. రాజుగారు హుటాహుటిన పుట్ట దగ్గరకు వెళ్ళి జాగ్రత్తగా పుట్ట తవ్వించాడు.

పుట్టలోంచి పాము కాదు, మూలుగుతున్న ముసలి మనిషి ఒకడు బయట పడ్డాడు! ఒక కంట్లోంచి నెత్తురు కారుతోంది. విచారించగా ఆయన మహా తపస్వి అయిన చ్యవనమహర్షి – అనీ, చాలా కాలంగా నిశ్చల తపస్సమాధిలో ఉండిపోవడం వలన ఆయనమీద పుట్టలు పట్టేశాయనీ, ఇవాళ ఎవరో ఆయన కంట్లో పుల్ల పెట్టి పొడిచారనీ, దాంతో ఒక కన్ను పోయిందనీ, ఆ కోపంతో ఆయనే ఈ రాజ్యాన్ని ఇలా శపించాడనీ, తెలిసింది. రాజుగారు బెంబేలెత్తిపోయి మహర్షి కాళ్లమీద పడి శాపం ఉపసంహరించుమని ప్రార్థించాడు.

మునిగారికేం పుట్టిందో, ఇంతెత్తున లేచి, "ఈ వయస్సులో నేను గుడ్డివాడ్ని అయిపోయాను. ఇప్పుడు నన్ను ఎవరు చూస్తారు? నీ కూతురే ఈ పని చేసిందంటున్నావు కనుక, ఆ కూతుర్ని నాకిచ్చి పెళ్లి చేసి, నా దగ్గర వదలి పెడితే, నా శాపం ఉపసంహరిస్తా" – అని మొండికెత్తేశాడు.

రాజుగారికి మనసొప్పలేదు. ఒక ప్రక్క ప్రజల ప్రాణాలెగిరిపోతున్నై. తన ప్రాణాలే పోయేటట్లున్నై. అయినా కూతురి గొంతుకోయడం ఇష్టం లేక, ఆయన మహర్షిని బ్రతిమాలుతున్నాడు. మహర్షి మొండికెత్తుతున్నాడు.

ఈ వార్త సుకన్యకు తెలిసింది. ఆమె సరాసరి పుట్ట దగ్గరికి వచ్చేసి, నేను ఈ మనిషిని వివాహం చేసుకుంటానని ఘంటాపథంగా చెప్పేసింది. ఎంత మంది బ్రతిమాలినా వినలేదు. పెళ్లయిపోయింది. శాపం తీరిపోయింది.

నిన్నటి దాకా మదించిన రాజపుత్రి ఇవ్వాళ్ల ముష్టిమునిపత్ని, గుడ్డిముని పత్ని! నిన్నటిదాకా మహా నగరంలో రాజభవన నివాసిని, ఇవ్వాళ కారడవిలో వృక్షమూల నివాసిని! అయినా, అదేమి చిత్రమో, ఆ సుకన్య వీసమంత కూడా జంక లేదు. "తప్పు తనది. దీని శిక్ష ప్రజలకు పడరాదు"– అనే నిశ్చయంతో పెళ్ళికి ఒప్పేసుకుంది. ఒప్పుకున్నాక అతని సేవ చేయడం తన విధి, తన ధర్మం! ఈ ధర్మమే ఆవిడ స్వభావం, ఆవిడ ప్రభావం, ఆవిడలో వున్న అనుభావం!! దీనివల్లే ఆవిడ ఆ ముసలి భర్తకు కొన్ని వందల ఏళ్లపాటు ప్రీతి పూర్వకంగా సేవ చేసింది.

అన్నేళ్ల సేవ తరువాత ఆ ముని కరుణించి, ఆవిడకు అశ్వినీ దేవతా మంత్రోపదేశం చేశాడు. ఆవిడ ఉపాసన చేసింది. సుందరాకారులని ప్రసిద్ధి గాంచిన అశ్వినీ దేవతలు ప్రత్యక్షమై మమ్మల్ని వరించుమన్నారు. ఆవిడ ఆ పరీక్షకు తట్టుకొని నిలబడింది. ఫలితంగా , అశ్వినీ దేవతలు ఒక లేహ్యాం తయారు చేసి, చ్యవనమహర్షిచేత తినిపించారు. ఆ లేహ్యా ప్రభావంవల్ల ఆ ముసలిముని క్రమంగా నవయౌవన స్వరూపుడయ్యాడు. ఆ పుణ్యా దంపతుల అనుగ్రహం వల్ల ఆ లేహ్యాం "చ్యవనప్రాశ" అనే పేరుతో లోకానికి అందింది.

ఈ కథలో, మొదట, సుకన్య గర్విష్టి రాజకుమారి. అంతవరకూ మనమూ గుర్తించాం. కాని చ్యవనమహర్షి దీనితో బాటు మహోజ్వలమైన ధర్మనిష్ఠ అనే అనుభావాన్ని కూడా గుర్తించాడు. అందుకే, ఈ జీవిని మామూలు రాజసంసార జీవిగా కాక, ఉత్తమ తపస్విగా మార్చాలని నిశ్చయించుకున్నాడు. శాపమనే పన్నాగంతో ఉపాయంగా అనుకున్నది సాధించి, సుకన్యను మనమందరమూ నిత్యమూ స్మరించతగ్గ ఉత్తమ తేజోమూర్తిగా తీర్చిదిద్దాడు.

మనం కూడా నేర్చుకోవలసిందిదే. ఎదుటివారి తప్పులనే కాదు, వారిలో ఉండే మంచిని కూడా గుర్తించడం నేర్చుకోవాలి.

మీ స్వామీజీకి దివ్య శక్తులు, దివ్యదృష్టి , వున్నాయని మీలో చాలామంది నమ్ముతున్నారు. అలా నమ్మేవారి చెవిలో ఒక రహస్యం చెప్పదలుచుకుంటున్నాను.

" మీరు నిజంగా నమ్ముతున్నారు కదా, మీ స్వామీజీకి దివ్యదృష్టి ఉందని! అలాంటప్పుడు మీలో ఉన్న తప్పులు ఆయనకు తెలియవా? మీలో ఎన్ని తప్పులున్నాయో మీకు తెలియవా? వీటిల్లో ఒకటి, రెండు తప్పులున్నా సరే మీరు మీ ప్రక్క వాళ్లను క్షమించలేకపోతున్నారే! మరి మీ స్వామీజీ అన్నీ తెలిసి మీతో ఇంత ప్రీతిగా ఎలా ఉండగలుగుతున్నారు?! కొంచెం ఆలోచించండి. పెద్ద రహస్యమేమీ లేదు. ఇప్పుడు చెప్పుకున్న విషయమే. మీ స్వామీజీ మీ తప్పులను చూస్తారు గాని, వాటిని పట్టించుకోరు. మీ లాగా వాటికి ఏవేవో సాకులు చెప్పి సమర్థించరు. కాని పట్టించుకోరు. వాటితోపాటు మీలో ఉన్న మంచిని గూడా చూస్తారు. అయితే దీన్ని బాగా గుర్తిస్తారు. గట్టిగా గుర్తు పెట్టుకుంటారు. అందుకే మిమ్మల్ని ప్రేమించ గలుగుతున్నారు. నటనతో కాదు, నిజంగా ప్రేమించగలుగుతున్నారు. మీరు కూడా ఆయనను ప్రేమించి సహకరిస్తే, మీ తప్పులను నొప్పి లేకుండా దిద్దాలని చూస్తున్నారు. చ్యవనమహర్షి కొద్దిగా నొప్పి పెట్టి దిద్దారు. మీ స్వామీజీకి అది కూడా ఇష్టం లేదు. మీకు కొంచెం కూడా నొప్పి లేకుండా దిద్దాలనే ఆశపడుతున్నారు. మీరూ ఇదే నేర్చుకోండి!!"

ఇదే మీ స్వామీజీ మీకు చెప్పదలచుకున్న రహస్యం!

మీ స్వామీజీ రహస్యంగా చెవిలో చెప్పిన మాటలనే, ఈ సూక్తి బహిరంగంగా చెపుతోంది. సాధకులందరకూ చెపుతోంది.

దానితోపాటు, ఒక మంచి ఉదాహరణ గూడా ఇస్తోంది. ఎన్ని మెలికలు తిరిగినా నది సముద్రాన్నే చేరుతుంది- అంటోంది. నది సముద్రాన్ని చేరేది, మళ్లీ ఆవిరై, మేఘమై, వర్షమై, జలధారై, భూమిని చేరాలనేదే! ఇది నిస్స్వార్థ స్థితికి పరాకాష్ఠ! ఈ ఉదాహరణద్వారా నిస్స్వార్థతే ఉత్తమమైన అనుభావానికి చిహ్నం – అని గూడా ఈ సూక్తి సూచిస్తోంది.

సమస్త జగద్గురువైన దత్తప్రభువు కృపతో మీ కందరికీ ఈ సూక్తి సందేశం అంది, ఇతరుల అనుభావాలను గుర్తించడం ద్వారా, మీ అనుభావాన్ని పెంచుకునే కిటుకు మీ చేతికి చిక్కాలని ఆశీర్వదిస్తూ! జయగురుదత్త **శ్రీస్వామీజీ.**

✿ ✿ ✿

# పూజ్య శ్రీస్వామీజీవారి నూతన సంవత్సర సందేశం

**(విజయవాడ ఆశ్రమంలో 01.01.2006 నాటి అనుగ్రహభాషణ సందేశం)**

**ఆంగ్లమూలం: ఇంటర్‌నెట్ అనువాదం : స్టాఫ్ కరెస్పాండెంట్**

వివిధ పాఠశాలల విద్యార్థులు భజనలను ఆలాపించటం చూసి స్వామీజీకి చాలా సంతోషమైనది. స్వామీజీ వివిధ రకాల శైలిల్లో భజనలను రచించడం జరిగింది. అవి గ్రామీణ నృత్యాలకు, నృత్యరూపకాలకు, కూడా అనుగుణంగా ఉంటాయి. ఈ విధంగా అవి మణి, మాణిక్యాలు, రత్నాలు వలె అందరికీ ఉపయుక్తమయ్యే రీతిలో ఉంటాయి. అందులో నుండి ఎవరికి నచ్చినవి వారు ఎంచుకోవచ్చు. అనేక రకాల గ్రామీణ నృత్యాలకు అనుగుణంగా స్వామీజీ భజనల శైలిని సరిచేసుకోవడానికి స్వామీజీ అనుమతించారు. స్వామీజీ భజనలు కొన్ని పూర్తిగా సంస్కృతపదాలతో కూడినవి. మరికొన్ని మణిప్రవాళ విధానంలో అనగా ఒకే భజనలో వివిధ భాషల పదాలు కలిసి వుంటాయి. వాగ్గేయకారులు ఒక్కొక్కరు ఒక్కో విధానంలో ఒక్కో శైలిలో వ్రాస్తుంటారు. ఆ విధంగా వారి పాటలను, కవితలను విని ఆ రచయిత/కవి పేరును గుర్తించవచ్చు. కానీ, కొన్ని సందర్భాలలో అది సాధ్యం కాకపోవచ్చు. ఎందుకంటే, ఉదాహరణకు వివిధ సమయాలకు అనుగుణంగా, కాలాలకు సరిపడే విధంగా, స్వామీజీ భజనలను మార్చి వ్రాస్తుంటారు. అవి పండితులకు, పామరులకు కూడా అర్థమయ్యే విధంగా ఉంటాయి.

కీర్తనల, భజనల, పద్యాల, గద్యాల రూపకంగా రచనలు వైవిధ్యంగా ఉంటాయి. గత 7 సంవత్సరాలుగా చెన్నైలో వివిధ పాఠశాలల విద్యార్థుల మధ్య భజనల పోటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఆ పోటీ రోజులలో మద్రాసు ఆశ్రమం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంటుంది. అందులో 30 పాఠశాలల నుండి అనేక మంది విద్యార్థులు పాల్గొనడమే గాక, ఎంతో పేరుపొందిన గాయకులు, సంగీతకారులు కూడా ఆ సందర్భాలలో ఉత్సాహాన్ని ఆసక్తిని చూపిస్తారు. వారు కూడా స్వామీజీ భజనలను ఎంతో ఇష్టపడుతారు. **ఈ భజనలు కేవలం రచనలే గాదు, వాటిలోని నాదంతో, బీజాక్షరాలతో అవి శారీరక, మానసిక ఆరోగ్యానికి కూడా ఎంతో ఉపయోగపడుతాయి. వాటిలో ఆధ్యాత్మిక శక్తితరంగాలుంటాయి.** అందుచేతనే అనారోగ్యంతో బాధపడుతూ స్వామీజీ దగ్గరికి

వచ్చే భక్తులు చూపించే ఎక్స్-రే రిపోర్టును గానీ, ఎమ్.ఆర్.ఐ. రిపోర్టును గానీ, మరి ఇతర రిపోర్టులను గానీ చూడకుండానే ఈ భజనల, దివ్యనాద సంగీతాల క్యాసెట్లను, సీ.డీ.లను వినుమని స్వామీజీ వారికి చెప్తారు. **నిజంగా అవి మందులకంటే ఎక్కువగా, అద్భుతంగా పనిచేసి రోగనివారణకు/ఉపశమనానికి కారణమౌతాయి.** ఈ విషయాన్ని కొత్తవారు నమ్ముతారా లేదా అనే విషయం ప్రక్కకు పెట్టినా, దీన్ని వారు అర్థం చేసుకోవడానికి సమయం పడుతుంది. ఇక్కడ ఆధ్యాత్మిక శక్తితరంగాలు పనిచేస్తాయి. "నమ్మరాదు అమ్మో నిన్ను దత్తదత్త" అనే భజనలో ఉన్న విధంగానే స్వామీజీయొక్క స్పందనలుంటాయి.

**స్వామీజీ మంచి నావికుడు, మంచి క్యాప్టెన్ అని నమ్మకం ఉన్నవారు స్వామీజీ ఓడను ఎక్కవచ్చు. ఓడయొక్క ప్రయాణం ప్రారంభం అవగానే అది స్వామీజీ ఇష్టానుసారం నడుస్తుంది, మీ ఇష్టానుసారంగా మాత్రం కాదు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా స్వామీజీ ఆ ఓడను నడుపుతారు.**

సంస్కృతం నుండి ఎంతో కష్టమైన అనువాద కార్యక్రమాన్ని పూర్తిచేసి శ్రీవిద్యాసాగర్‌శర్మగారు "దత్తాత్రేయ సర్వస్వం" అనే తెలుగు పుస్తకాన్ని రచించడం, అదే విధంగా, దాన్ని శ్రీనరసింహారావుగారు ఆంగ్లభాషలోకి అనువదించడం స్వామీజీకి సంతోషమైనది. ఇందులో దత్తాత్రేయుడికి సంబంధించిన ఎన్నో జ్ఞానసంబంధ విషయాలు ఉన్నాయి. ఈ పుస్తకం దత్తసాధకులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందనడంలో సందేహం లేదు. 1200 పేజీలు గల ఈ పుస్తక ప్రచురణకు భక్తులు ముందుకు రావాలి. దత్తస్తవానికి సంబంధించి స్వామీజీ 4 గంటల పాటు విశేషంగా వివరించిన అర్థాలతో కూడిన డీ.వీ.డీ.ని ఈ రోజు ఆవిష్కరించడం జరిగింది. ఈ విధంగా స్వామీజీ ఉపన్యాసం మీ ఇళ్ళల్లోకి ప్రత్యక్షంగా చేరుతోంది.

ఈ రోజు ఉదయం 14000 మంది స్వామీజీని దర్శించి, అనుగ్రహం పొందారు. ఉదయం రానివారు ప్రస్తుతం చాలా మంది ఇక్కడ ఉన్నారు.వారందరికి కూడా నూతన సంవత్సర శుభాకాంక్షలు. మీ అందరికీ ఆరోగ్యాన్ని, సంతోషాన్ని, ఓర్పును, ప్రేమ ఆప్యాయతలను, దేశభక్తిని, గురుభక్తిని అనుగ్రహించాలనీ, ఈ సంవత్సరమంతా దత్తుడి ఆశీస్సులు వుండాలనీ, స్వామీజీ దత్తుడిని ప్రార్థిస్తున్నారు.

మనం కొత్త సంవత్సరంలోకి ప్రవేశించినాము. దీని వలన మార్పు ఏమి సంభవిస్తుంది? మీ కర్తవ్యాలలో, బాధ్యతలలో మార్పు ఏమీ ఉండదు. అందరూ

వారి వారి కర్తవ్యాలను నెరవేర్చాల్సిందే. శ్రీరాముడు రాజ్యానికి వచ్చినప్పటికీ మీ పనులలో, కర్తవ్యాలలో మార్పు ఉండదు. రైతు కూరగాయలను, పంటను పండించాల్సిందే. అదే విధంగా గృహిణి తన వంటపని చేసుకోవాల్సిందే. రాముడు వచ్చి ఆ పనులను చేసిపెట్టడు. **కొత్త సమయాలు కొత్త అవకాశాలను కలిగిస్తాయి. అంతే. వాటిని మనం ఉపయోగించుకొని అభివృద్ధిని పొందాలి.** మనం ప్రస్తుతం పాతవి అనేవి ఒకప్పుడు కొత్తవే. అదే విధంగా అత్త కూడా ఒకప్పుడు కోడలే మరియు నేటి కోడలే రేపటి అత్తగారు.

స్వామీజీ రచించిన "యుగ యుగ యుగంబులు" అనే భజనలోని విధంగా, మన లాగా అదృష్టవంతులు కానివారి యెడల ప్రేమ, ఆప్యాయతలను అందరూ పెంచుకొని వారికి సహాయం చేయాలి. నిన్న ఒక భక్తుడు చాలా సార్లు "నేను ఎలాంటి సేవ చేయాలి?" అని అడిగినాడు. "వెళ్ళి 200 బ్యాంకెట్లను కొని నివాసంలేక వీధిలో పడుకున్న అభాగ్యులకు దానం చేయి" అని స్వామీజీ చెప్పారు. ఆయన ఆశ్చర్యపోయాడు, కాని దాని ఆవశ్యకతను అర్థం చేసుకుని నిర్వహించడానికి సంతోషంతో సంసిద్ధమైనాడు. అదే విధంగా మీరందరు కూడా ఇతరులకు సహాయం చేయాలి అని స్వామీజీ కోరుతున్నారు. మీ చుట్టు ప్రక్కల పరిస్థితులను గ్రహించి మీకు వీలైనంత సేవను చేయండి, సహాయాన్ని అందించండి. ఈ మంచి తత్వాన్ని అందరిలో కలిగించండి. ఈ స్వల్ప సహాయమే ఎంతో గొప్ప ఫలితాన్ని కలిగిస్తుంది. ఆకలిగా ఉన్నవాడికి అన్నదానం చేయండి. అది ఎంతో సహాయకారి అవుతుంది. మీకు వీలైన రీతిలోనే సహాయాన్ని అందించండి. **ఈ రోజు మీరు ఇచ్చేది, ఇంతకు ముందు వేరే వారి అధీనంలో ఉండినది. అదే వస్తువు రేపు ఇంకొకరి సొత్తు అవుతుంది. మీరు వచ్చేటప్పుడు ఏమీ తీసుకు రాలేదు. వెళ్ళేటప్పుడు కూడా మీరు ఏమీ తీసుకుపోలేరు. భగవంతుడికి మీరు సమర్పించే అభిషేకాన్ని కూడా ఆయన తీసుకోవడం లేదు. దాన్ని ప్రసాదంగా మీకే ఉంచుతున్నాడు. ఈ తత్వాన్ని అందరూ అర్థం చేసుకోండి.**

రాతితో కట్టిన దేవాలయంలోకి వెళ్ళి, రాతిలో మలచిన దేవుడిని, మన రాతి (కఠిన) హృదయంతో ప్రార్థిస్తాం. ఈ విధంగా మన కఠిన (రాతి) హృదయంతో, మన కోరికలను తీర్చాలని ఆ రాతిదేవుడిని ప్రార్థిస్తాం. ఇది విడ్డూరంగా లేదు? స్వామీజీ ఈ మధ్య వ్రాసిన కవితలలో ఇలాంటి వ్యంగ్య కవితలే ఎక్కువగా ఉన్నాయి. **మీరు మీ కఠిన హృదయాలను మృదు హృదయాలుగా**

**మార్చుకొని, అందులో ప్రేమను, జాలిని, దయను నింపుకొని ప్రవర్తించండి.** ఒక నాటకాన్ని పూర్తిగా అర్థం చేసుకొని ఆనందించాలి అని అనుకుంటే, కేవలం చూడటమేగాక ఆ పాత్రలో మీరు కూడా పూర్తిగా లీనం కావాలి. అప్పుడే మీరు బాధ్యతగల ప్రేక్షకులు అవుతారు. కొంత మంది ఎంత అమాయకంగా ఉంటారంటే, వారిని తిట్టినా కూడా, దాన్ని వారు అర్థం చేసుకోలేకపోతారు. చెడ్డవాడు మాత్రమే చెడుపనిని అర్థం చేసుకుంటాడు. తప్పులు చేసే అలవాటు మీకు లేకపోతే ఆ తప్పులను మీరు ఎన్నటికీ గుర్తించలేరు. దొంగతనం చేసే విధానాన్ని తెలుసుకున్నవాడే దొంగను పట్టుకోగలుగుతాడు. దొంగ ఏ విధంగా ఆలోచిస్తాడు, ఏ విధంగా ప్రవర్తిస్తాడు అనే విధానంలోనే పోలీసులకు శిక్షణను ఇస్తారు. అందుకే వారు ఆ కేసులను పరిష్కరిస్తారు. అదే విధానాన్ని స్వామీజీ కూడా ఆచరిస్తారు. స్వామీజీకి అనేక రంగాలలో నైపుణ్యత ఉన్నది. తన చుట్టూ ఉన్నవారి ఆలోచనలను, భావనలను స్వామీజీ కనిపెట్టారు. తన దగ్గరికి వచ్చిన కళాకారుడి భావాలను గానీ, లోభి భావాలను గానీ, అదే విధంగా చెడు ఆలోచనలతో ఉన్నవారి భావాలను గానీ, అన్నీ స్వామీజీ గ్రహించగలుగుతారు.

**ఈ సంవత్సరంలో ఏకాగ్రత, ధ్యానం అనేవి అత్యంత ఆవశ్యకతలు. తృప్తిగా జీవించండి. ఆనందం లభిస్తుంది. సద్గురువు కృప మీ అందరికీ ఉంటుంది. ఇదే స్వామీజీ ఈ నూతన సంవత్సర సందేశం. జయగురుదత్త**

ఫోటోల వివరాలు (రెండవ పేజీ తరువాయి)

3) దత్తజయంతిరోజు దత్తాత్రేయస్వామివారితోపాటు తెప్పోత్సవంలో శ్రీస్వామీజీ.

4) దత్తజయంతిరోజు కాగడహారతిని నిర్వహిస్తున్న శ్రీస్వామీజీ.

5) మేకెదాటు ఆశ్రమంలో కుంభాభిషేకానంతరం, కార్యసిద్ధి ఆంజనేయస్వామివారికి హారతినిస్తున్న శ్రీస్వామీజీ.

6) హంపి పర్యటనలో హజారా రామమందిరంలోని స్తంభం దగ్గర ప్రతిధ్వని వింటున్న శ్రీస్వామీజీ.

7) హంపి విరూపాక్ష దేవాలయంలో లక్ష్మి అనే ఏనుగు తొండంతో శ్రీస్వామీజీవారిని స్వాగతిస్తున్న దృశ్యం.

(8) హంపిలోని నరసింహస్వామి విగ్రహం ముందు నిలబడిన శ్రీస్వామీజీ.

పిల్లలూ, వీరు

## అగస్త్యుడు - ఇంద్రద్యుమ్నుడు



మీకు తెలుసా?

***(జరిగినకథ : అగస్త్యచరిత్రలో ఇంద్రద్యుమ్న ఘట్టంలో వున్నాం మనం. ఆ రాజు వార్ధక్యం వచ్చాక తపోవనాలకు వచ్చి వారితో వీరితో మాట్లాడుతూ కూర్చోవటం ఇష్టంలేక ఒక కొండమీద మకాం పెట్టాడు. ఇక చదువండి....)***

మన మనస్సుల్లో రెండు రకాల ఆలోచనాలు వుంటాయి. వాటిల్లో మంచి ఆలోచనలను మాత్రం పెద్దవిగా చేసి చూసుకొని సంతోషపడుతూ వుంటాం మనం. పైనున్నవాడికి మాత్రం మన రెండాలోచనలూ కనిపిస్తూనే వుంటాయి. అందుకే అప్పుడప్పుడాయన చిన్న చిన్న చమత్కారాలు చేస్తూ వుంటాడు.

ఒక రోజున అగస్త్యమహర్షి ఆ ప్రాంతానికి వచ్చాడు. అక్కడి మహర్షులంతా ఎంతో సంతోషపడి, ఆయనకు స్వాగతాలు పలికి, ఆయన అనుగ్రహంతో, తపస్సాధనలోని కొత్త కొత్త రహస్యాల నందుకున్నారు. ఆ మాటల ప్రసంగంలో, ఇంద్రద్యుమ్న చక్రవర్తి ఆ కొండమీద చాలా శ్రద్ధగా తపస్సు చేసుకుంటున్నాడని మిగిలిన మహర్షులు చాలా సంతోషంగా చెప్పారు. ఆరాజర్షికి కూడా కొంత అనుగ్రహం ధారపోయాలని అగస్త్యమహర్షికి ఆశ పుట్టింది. మహాత్ములకు మిగిలిన ఏకైక ఆశ పరోపకారమే కదా!

గుడినే మింగిన వాడికి లింగమో లెక్కా? సముద్రాన్ని మింగిన వాడికి కొండో లెక్కా? అగస్త్యమహర్షి చరచరా రాళ్ళెక్కి ఇంద్రద్యుమ్న చక్రవర్తి వుంటున్న పర్ణశాలలోకి ప్రవేశించాడు. ఈయన వెళ్ళేసరికి ఆ

మహారాజుగారు కళ్ళు మూసుకుని వున్నాడు. కళ్ళుమూసుకున్నా, ఆయన తక్కువవాడేమీ కాదు. వచ్చింది అగస్త్యమహర్షి అని గ్రహించాడు. "ఎవరైతే నేమి? వాళ్ళు గొప్పవాళ్ళైతే మనకేమి వస్తుంది? మనపని మనది. పైగా మనం మౌనవ్రతంలో వున్నాం కదా" అనుకుని, ఆ రాజు అలాగే కదలకుండా కుర్చుండి పోయాడు. కళ్ళు తెరవలేదు. నోరు మెదపలేదు.

అగస్త్యమహర్షి అలాగే కొంతసేపు నిలబడ్డాడు. ఆ రాజు కొంచెంసేపు సమాధిలోకి వెళ్తున్నాడు. మళ్లీ వెనక్కు వస్తున్నాడు. ఈ రాజుకు పాత అలవాట్లు పోలేదనీ, వచ్చినవాళ్ళు ఎదురుచూడక ఏం చేస్తార్లే అనే రాజసం తగ్గలేదనీ, మహర్షిధర్మం వంటబట్ట లేదనీ, ఆయనకు అర్థమైంది. ఇతను ఇలాంటి రజోగుణంతో ఎంత తపస్సు చేసినా, ఉత్తమసిద్ధి రానే రాదు - అని ఆయన గ్రహించేశాడు. ఇలా ఆలోచించుకుంటూ వుండగానే, అగస్త్యమహర్షికి కళ్ళు ఎర్రబడి పోయిన్నై, వొళ్లు పొంగింది. ముఖం గంద్ర బారింది. అంతే, ఆయన గొంతెత్తి తీవ్రస్వరంతో -

"రాజా! నీకు గర్వం దిగలేదు. అగస్త్యుడు వచ్చినా కళ్ళు తెరవకుండా, మదపుటేనుగు లాగా కునికిపాట్లు పడుతున్నావు. నిజంగానే నువ్వు ఏనుగువై పుట్టు" అని అరచి నేలమీద నీళ్ళు పోసేశాడు.

ఈ దెబ్బతో రాజుగారి మౌనవ్రతం ఎగిరిపోయింది. గర్వం కరిగి పోయింది. కళ్ళు తెరుచుకున్నై. కాళ్ళు నిలబడ్డాయి. శిరస్సు నేలమీద పడి అగస్త్యమహర్షి కాళ్ళమీద దొర్లింది. ఇప్పుడు మౌనవ్రతం అగస్త్యమహర్షి వంతైంది. వలవలా విలపించటం రాజువంతైంది.

"బ్రహ్మర్షిశేఖరా! అగస్త్యమహర్షీంద్రా, అనుగ్రహించండి. మౌనవ్రత నియమంమీది పట్టుదలతో అలా చేశానే కానీ, మిమ్మల్ని

తిరస్కరించాలని కాదు. నన్ను క్షమించండి, శాపం ఉపసంహరించండి, అనుగ్రహించండి." అని ఆ రాజు పరిపరి విధాల ప్రార్థించాడు. చివరకు అగస్త్యమహర్షి మెత్తబడి, ఇలా అన్నాడు. –

" రాజా! రాజ్యం విడిచిపెట్టావు. అడవికొచ్చావు. కొండమీదకెక్కావు. అయినా, నువ్వు రాజుగానే వుండిపోయావు. ఋషివి కాలేకపోయావు. ఇలా ఎంత తపస్సు చేసినా, ఫలితం ఇలాగే వుంటుంది. నీలో గూడు కట్టుకొనివున్న గర్వానికి శిక్ష కావాలి. అందుకే ఈ శాపం నా నోటి వెంట వెలువడింది. దాన్ని అలాగే జరుగనీ. ఐనా భయపడకు. నువ్వు వెంటనే ఏనుగువైపోవు. ఇప్పుడు వచ్చిన ఈ కొత్త జ్ఞానంతో, ఈ కొత్త సంస్కారంతో, రాజధర్మం విడిచిపెట్టి, ఋషిధర్మం పాలిస్తూ, మిగిలిన జీవితమంతా తపస్సు చెయ్యి. వచ్చే జన్మకు ఏనుగు అవుదువుగాని.

"గర్వబీజం హృదయంలో మొలకెత్తితే, ఒక జన్మ, ఒక శిక్ష, చాలవు . ఈ జన్మలో నీకు శిక్ష పడ్డది కానీ, అది ప్రాణాంతకమైన శిక్ష కాదు. పై జన్మలో అది కూడా రుచి చూద్దువుగాని. అప్పటికి నీ గర్వబీజం పరిపూర్ణంగా దగ్ధమై, ఈ జన్మలో చేసిన తపస్సు అప్పటికి అందుకుని, నీ శ్రీహరి భావన పరిపూర్ణమై, పరిపూర్ణతాస్థితిని అందుకొందువు గాక!" *(సశేషం)*

నాదమే నా భాష, నాదమే నా భావం, నాదమే నా ధర్మం. – శ్రీస్వామీజీ

❀ ❀ ❀

ఎల్లప్పుడూ గురు రూపాన్నే స్మరించాలి. గురు నామాన్నే జపించాలి. గురువు ఆజ్ఞనే పాలించాలి. వేరే యేదీ భావించరాదు. – గురుగీతలో శివుడు

❀ ❀ ❀

గురువు నివాస స్థలమే కాశీక్షేత్రం. గురువు పాదముద్రలు పడినచోటే విష్ణు పాదాంకితమైన గయాక్షేత్రం. తీర్థరాజమైన ప్రయాగక్షేత్రం కూడా అదే.

– గురుగీతలో శివుడు

# ఆత్మదానము



## శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ

**(జరిగినకథ : అత్రి అనసూయల కథలో ఆత్రేయ స్మృతి ప్రవచనం తరువాత - సుమతీదేవి ప్రస్తావన వచ్చింది. సుమతి భర్త కౌశికుడు ఒక వాదంలో ఓడిపోయి, ఆవేశంలో స్పృహ తప్పి, ఎలాగో మళ్లీ లేచి, రాజుగారి బండిలో ఇంటికి చేరాడు. అతనితోపాటు రాజవైద్యుడు గూడా వచ్చాడు. ఆ తరువాత అతని పదవి పోయింది. ఎవరెవరో తన భర్త గురించి ఏవేవో మాటలు చెపుతున్నారని సుమతి లోలోపలే బాధ పడుతోంది. కౌశికుడి ప్రవర్తనలో మాత్రం మార్పు లేదు. ఇక చదువండి.....)**

రోజులలాగే సాగిపోతున్నై. కౌశికుడు వారానికో, పది రోజులకో ఇంటికి వస్తున్నాడు. వచ్చినప్పుడల్లా అతని కళ్లు వాచి, ఎఱ్ఱబడి, రోగం గూడు కట్టినట్టుగా వుండేవి. మళ్లీ వెనుకటి రోగపు పోట్లు అప్పుడప్పుడు కనిపించసాగినై.

సుమతి కన్నీళ్లు పెట్టుకొని, "రాజవైద్యుడి దగ్గర మందు పుచ్చుకోరాదా" అని బ్రతిమాలుతుంది. కౌశికుడు చర్రుమని లేచి "వాడికేం తెలుసు? వాడి శ్రాద్ధం. డాంబికాలుండి, కాళ్ళు నాకటం నేర్చి, ఆస్థానపదవి పొందగానే సరిపోయిందా? అమ్మాయీ, అమ్మాయీ అని బుల్లి బుల్లి మాటలు చెప్పంగానే వెఱ్ఱి మొహం వేసుకొని, వాడే దేవుడనుకుంటావు. వాడి తాతల్లాంటివాళ్లున్నారు వైద్యులు. నేను మందు పుచ్చుకుంటూనే వున్నా. నీ సలహాలతో నాకు పనిలేదు. పో పో అని నాలుగు దులుపులు దులుపుతాడు. అదీ చాలక, "నామీది ప్రేమా ఇదంతా? ఎత్తిపొడవడానికి ఎప్పుడు సందు

దొరుకుతుందా అని ఎదురు చూస్తూ వుంటావు. పైకి మాత్రం గంగనాచివి. అసలీ కానరాని తేలుకొండి బుద్ధి మీ కొంపలోనే వుంది". ఇలా మొదలెట్టి, ఇటేడు తరాలు, అటేడు తరాలు తిట్టిపోస్తాడు. అలాంటి సమయాల్లో అతన్ని బతిమాలబోతే నటన అంటాడు. వూరుకుంటే మొండితనమంటాడు. తిట్టి తిట్టి ఆయాసంతో తనంత తానుగా మానవలసిందే గాని, అతన్ని ఆపే మార్గమే లేదనిపిస్తూ వుంటుంది సుమతికి.

అతను ఏవేవో మందులు తెచ్చి అప్పుడప్పుడు పుచ్చుకుంటూ వుంటాడు. ఆ మందులు అమృతౌషధాలనీ, వాటికి పథ్యాలతో పని లేదనీ, భార్యకు చెపుతూ వుంటాడు. అతనికి రాను రాను జిహ్వ చప్పబడిందో యేమో గాని, తీపి పిండివంటలమీద అంతులేని వెర్రి పుట్టింది. ఎంత చక్కెరా చాలదు. ఎంత బెల్లమూ చాలదు. మడి మైలలు ఇదివరకే మంటగలిశాయి కనుక, ఇప్పుడు తినవచ్చు, అప్పుడు తినరాదు, అనే మాట లేనే లేదు! తీపి తిని తిని మొహం మొత్తుతుంది గాబోలు, ఇక నాలుగు రోజులు గొడ్డుకారమూ, రొడ్డు పులుపూ, తింటాడు. మళ్లీ నాలుగు రోజులు పోయాక తీపిమీద వెర్రి మొదలౌతుంది.

ఇలా గడుస్తూ వుండగా, హేమంతం వచ్చింది. ఆ యేడు మంచు విపరీతంగా పడసాగింది. ఆ చలికి ఓర్చుకోవటం దొడ్లల్లోని గొడ్డు గోదలకే కష్టసాధ్యంగా వుంది. అలాంటి రోజులలోనే కౌశికుడికి ఒంటినిండా ఎడతెగని చెమటలు పట్టసాగాయి. ఇదేదో విపరీత లక్షణంగా వుందని భార్య కంగారు పడిపోయింది. అతను మాత్రం "అనుక్షణమూ అమంగళమే ఆలోచిస్తావు. ఇది మీ యింట్లో అందరికీ వున్న జబ్బే" – అంటూ కసురుకొని, తాపం పోవటం కోసం మంచుగడ్డలు తెప్పించి, పానీయాల్లో ఆ మంచుగడ్డలు కలబోసి, త్రాగటం ప్రారంభించాడు. ఇదీ చాలక, రాత్రిపూట యథేచ్ఛగా వీధుల్లో తిరిగి, ఏ తెల్లవారుజాముకో ఇంటికి రావటం ఒకటి క్రొత్తగా సాగించాడు.

సుమతికి అదేం వెర్రో గాని, మొగుడింటికి వస్తే చాలు, అదే పదివేలనుకొంటుంది. ఆ చిటపటలాడే మొహం చూసినా చాలు, ఆమెకు వెయ్యి దీపాలు వెలుగుతాయి. ఎన్ని దీపాలు వెలిగితే ఏమి? అతని వొంటిమీద సగం చెరిగిన గంధపు పూతలు, కాటుక మరకలు, తిలకపు రేకలు, ఆమె కంటికి కనబడుతున్నట్లే లేదు.

హేమంత శిశిరాలు గడిచి, వసంతం ప్రవేశించింది. రాజధానిలో వసంతోత్సవాలు పొంగుగా సాగుతున్నై. ప్రతి సంవత్సరమూ ఈ ఉత్సవాలు

వచ్చినప్పుడు తన భర్తకు చాలా హడావిడిగా వుండేది. చాలా దేశాలనుంచీ పండితులు వచ్చి తమ యింట్లో బస చేస్తూ వుండేవారు. ఈ మాటెందుకో గానీ, భర్త చాలా తీరికగా వున్నాడు. అతిథులు గూడా ఎవ్వరూ ఇంటికి రాలేదు. సుమతికిదంతా అర్థంగాని విచిత్రంగా వుంది. ఎంత రాజాస్థాన పదవి లేకపోయినా బంధువర్గీయులైనా ఇంటికి రాకపోవటమేమిటి? భర్తను అడుగుదామంటే అదేమి నేరమవుతుందో?!

వసంతోత్సవాల్లో కౌశికుడి పనిసందడేమీ కనిపించలేదు గానీ, రాత్రిపూట మాత్రం ఇంట్లో వుండేవాడు కాదు. ఏం జరిగిందో ఏమో గానీ, చైత్ర బహుళం వచ్చే సరికి, కౌశికుడికి అకారణంగా నీరసం ఆరంభమైంది. ప్రత్యేకంగా పిండివంటలు చేయించుకు తింటాడు. బలవర్ధకాలంటూ, మినప పిండివంటలు, శనగ పిండివంటలు చేయించుకొని రోజూ ఆరగిస్తాడు. అవి జీర్ణం కావటం కోసం మందులు తెచ్చుకొని తింటాడు. ఐనా సరే, తిన్నది వంటబట్టదు.

భర్త కోరినవన్నీ సుమతి నిమిషంలో చేసిపెట్టేది. కానీ, అంత వ్యాధి వుండగా ఈ అపథ్యాహారమేమిటని లోలోపలే గిలగిలలాడేది. తాను కాదంటే అతను ఇంటికి రావటం మానేస్తాడు. అదీ చాలక ఇలాంటి తిళ్లన్నీ చాటుగా తింటాడు. అందుకోసమని, ఆమే పరమేశ్వరుడిమీద భారం వేసి, చెప్పింది చెప్పినట్టుగా నోరు మూసుకొని చేయ్యటమే తన కర్తవ్యమనుకొని ఊరుకుంది.

సుమారో నెలరోజులుగా కౌశికుడెక్కువగా ఇంటి పట్టునే వుంటున్నాడు. సుమతికదో పెద్ద వరం లాగా వుంది. సాయంత్రం పూట పెరట్లో, మామిడిచెట్ల నీడల్లో , చారగిలబడి కూర్చుని, భార్యతో ముచ్చట్లాడుతున్నాడు. సుమతికి స్వర్గానికెగిరినట్టుంది.

ఒకనాడామె భర్తకు దగ్గరగా కూర్చుని, అతని చెయ్యిమీద చెయ్యేసి రాస్తూ, అతను చెప్పేది వింటోంది. ఆమె చేతికి అతని శరీరం నున్నగా వుండి, నూనె రాచినట్లు నిగనిగలాడుతూ కనిపించింది. కొంచెంగా ఎర్రవాగు బడింది గూడా. భర్తకి ఆహారం వంటబట్టి కొంచెం నునుపుదేరుతున్నాడని ఆమె లోలోపల మురిసిపోతూ, ఆ మాట పదిసార్లనుకుంటే దిష్టి తగులుతుందేమో అనుకుంది.

కాని, అంతలోనే కౌశికుడు కొంచెం వెనక్కు జరిగి, “నీ మనస్సులో మార్దవం వుంటే గదా, నీ చేతిలో మార్దవం వుండటానికి?! నాకసలే లోపల వొళ్లంతా సూదులతో పొడుస్తున్నట్టుంది. దానికితోడు రంపం పెట్టి రాచినట్టు, నీదోగోల” అని విసుక్కున్నాడు.

సుమతి మొహం చిన్నబుచ్చుకుంది గాని, భర్త మొహంలో కోపం కన్నా బాధే అధికంగా వుండటం చూసి, తత్తరపడి పోయింది. చేతులు జోడించి, కళ్ల నీళ్లు పెట్టుకుంటూ "మంచి మందు పుచ్చుకోండి, మీకు పుణ్యం వుంటుంది"– అని ప్రతిమాలింది. "పుచ్చుకోకపోవటమేమిటి? నేనంటే ప్రాణప్రదంగా మందిచ్చే వాళ్లున్నారు. పుచ్చుకొంటున్నాను. కనుకనే ఆ అతిచెమట పోయింది. ఇపుడు చూశావా, ఎండలు ముదురుతున్నా నాకు చెమట చుక్కైనా పట్టటం లేదు. మందులు కొంచెం వేడి చేశాయి కాబోలు. కాస్త చర్మం చరచరలాడుతోంది. దీనికింతగోలేమిటి?" కౌశికుడెందుకో గాని సౌమ్యంగానే చెప్పాడు. ***(సశేషం)***

**ఆత్మార్పణమే అసలైన భక్తి. – శ్రీస్వామీజీ**

శ్రీమతి&శ్రీగడ్డం రాజేందర్‌గార్ల పుత్రిక
**చి॥ల॥సౌ॥సంగీత**
శ్రీమతి&డా॥గోశికె శ్రీనివాస్‌గార్ల పుత్రుడు
**చి॥విక్రాంత్ ల**
వివాహం ది.15.12.2005 గురువారంనాడు సికింద్రాబాద్‌లో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి&శ్రీజంధ్యాల శేషాచలపతిగార్ల ప్రథమ పుత్రుడు
**చి॥శ్రీసుచరణ్**
శ్రీపొన్నపల్లి వెంకటరామశాస్త్రిగారి పుత్రిక
**చి॥ల॥సౌ॥శ్రీవిద్య ల**
వివాహం ది.22.12.2005 గురువారం రాత్రి నర్సాపురంలో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి&డా॥మైనేని రమేష్‌బాబుగార్ల పుత్రిక
**చి॥ల॥సౌ॥కృష్ణసాహిత్య**
శ్రీమతి&శ్రీఅడుసుమిల్లి ప్రభాకరరావుగార్ల పుత్రుడు
**చి॥ లోకేష్ ల**
వివాహం ది.15.12.2005 గురువారంనాడు విజయవాడలో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

# యోగవాశిష్ఠ హృదయము

( గత సంచిక తరువాయి )

రచన : శ్రీకుప్పా వేంకట కృష్ణమూర్తి

ఇలా కొద్ది రోజులు గడిచాయి. రాముడికి 12 యేళ్ళు నిండాయి. భరతుడు అప్పుడప్పుడూ మేనమామ ఇంటికి పోయి వస్తూ వుండేవాడు. మిగిలిన ముగ్గురూ అయోధ్యలోనే వుంటూ వుండేవారు. దశరథుడికి, పిల్లల అభివృద్ధిని చూశాక, వారి వయస్సు చిన్నదైనా, త్వరగా పెళ్ళి చేస్తే బాగుండు అనిపిస్తూ వుండేది. ఆ విషయమే మంత్రులతో చర్చిస్తూ వుండేవాడు.

ఇలా వుండగా, రాముడు క్రమంగా ప్రాతఃకాల రాజసభలకు రావడం తగ్గించేశాడు. తమ్ముళ్లతో ఆటలూ తగ్గించేశాడు. మనిషి చిక్కిపోతున్నాడు. పాలిపోతున్నాడు. ఎప్పుడు చూసినా తన గదిలో చెంపకు చెయ్యి పెట్టుకొని, ఏదో ఆలోచిస్తూ వుండేవాడు. సేవకులు బతిమాలగా కాలకృత్యాలు తీర్చుకొంటాడు. ఇతని పరిస్థితి చూసి దశరథుడు గుచ్చి గుచ్చి అడిగేవాడు. ఎన్ని సార్లు అడిగినా ఏమీ లేదనేవాడు రాముడు. అంతకన్నా ఏమీ చెప్పడు. దశరథుడు వశిష్ఠుడ్ని సంప్రదించాడు. వశిష్ఠుడు రాముడ్ని పరిశీలించి, దశరథుడ్ని విడిగా పిలిచి, "గొప్ప వాళ్ళకు అల్పమైన విషయాలవల్ల కోపమూ రాదు, సంతోషమూ రాదు, సుఖమూ రాదు, దుఃఖమూ రాదు. శ్రీరాముడు మహాత్ముడు. అతని దిగులుకు గొప్ప కారణమే వుంటుంది" అన్నాడు. ఈ మాటలతో దశరథుడికి కొత్త దిగులు పట్టుకొంది. రాజభవనంలో ఎవరికీ సంతోషంగా లేదు. రాముడు రోజురోజుకీ చిక్కిపోతూనే వున్నాడు.

ఇంతలో ఒక రోజున మబ్బు లేని పిడుగు లాగా, విశ్వామిత్రమహర్షి వూడిపడ్డాడు. ఆయన వస్తూనే తన యాగరక్షణ కోసం, అనగా మహారాక్షసులతో యుద్ధం చేసేందు కోసం, రాముడ్ని తనతో పంపించుమన్నాడు. దశరథుడు ఏవో వంకలు పెట్టి తప్పించు కోవాలని చూశాడు. కానీ, విశ్వామిత్రుడు మండిపడ్డాడు.

పరిస్థితిలోని తీవ్రతను గుర్తించి, వశిష్ఠమహర్షి జోక్యం చేసుకొని, విశ్వామిత్రుడు కోరినట్లుగా రాముడ్ని పంపించుమని దశరథుడికి నచ్చజెప్పాడు.

అప్పుడు దశరథుడు తేరుకొని, రామలక్ష్మణులను తీసుకురమ్మని ఒక పరిచారకుడ్ని పంపాడు.

వెళ్ళిన పరిచారకుడు ఒక్కడే తిరిగి వచ్చి ఇలా చెప్పాడు –

"మహారాజా! మీ అబ్బాయి పరిస్థితి ఏమిటో మాకేమీ అర్థం కావటం లేదు. మీ నాన్నగారు పిలుస్తున్నారండీ అని అంటే, కాసేపు వస్తానంటాడు, కాసేపు రానంటాడు. మొన్న తీర్థయాత్రలకు పోయి వచ్చిన దగ్గర నుంచీ మీ అబ్బాయి పరిస్థితి మరీ విడ్డూరంగా వుంది. సంధ్యావందనమే సరిగా చెయ్యటం లేదు. ఏవైనా విలాస వస్తువులను చూస్తే ఏడుస్తున్నాడు. ఈ సుఖాలన్నీ ఆభాస సుఖాలనీ, ఈ భోగాల మోజులో పడవద్దనీ, మిత్రులకు పదే పదే బోధిస్తున్నాడు. చేతిలో ఎంత వుంటే అంత యాచకులకు దానం చేసేస్తున్నాడు. మంచి బ్రాహ్మణోత్తములు ఎవరైనా కనిపిస్తే ఈ ప్రపంచమంతా నశ్వరమంటూ పకపకా నవ్వుతున్నాడు. అమ్మా నాన్న బంధువులంటే, మండిపడుతున్నాడు. ఈయన్ను చూసి, ఈయన తమ్ముళ్లు లక్ష్మణ శత్రుఘ్నులు కూడా ఈయనకు నకలుగా తయారవుతున్నారు. మహారాజా! బిడ్డల్ని ఇలా వదలి వేస్తే లాభం లేదు. ఎవరైనా మంచి మహానుభావుడ్ని పట్టుకొని బిడ్డల్ని బాగు చేయించుకోండి."

పరిచారకుడు చెప్పిన మాటలను విశ్వామిత్రుడు కూడా విన్నాడు. ఆయన గట్టిగా ఆలోచించి, "దశరథా! ఇదంతా స్వచ్ఛమైన వైరాగ్యం వల్ల కలిగిన పరిణామమే గానీ, అజ్ఞానం కాదు. రాముడ్ని ఇక్కడకు రప్పించు. అతని సంశయాలన్నీ నేను దూరం చేస్తాను. అతనికి అఖండానందం ప్రాప్తిస్తుంది" అన్నాడు. అది విని దశరథుడు ప్రతీహారిని పంపాడు. కానీ, ఇంతలో రాముడే అల్లంత దూరంలో కనిపించాడు.

వచ్చిన రాముడు క్రమం తప్పకుండా పెద్దలందరికీ నమస్కారాలు చేశాడు. దశరథుడు రాముడ్ని వొళ్లో కూర్చోబెట్టుకొని, "నాయనా! నువ్వు వివేకివి. కానీ, తెలివితక్కువవాడి లాగా మనసును కల్లోల పరచుకొంటున్నావు. మనసులో సమస్యలు తలయెత్తితే, తగిన పెద్దలతో చర్చించాలి. అంతేగానీ, కల్లోలపడి అవివేకి లాగా ప్రవర్తిస్తే ఆపదలే సంభవిస్తాయి" – అన్నాడు. వశిష్ఠ విశ్వామిత్రులిద్దరూ, దశరథుడికి వత్తాసు పలికారు. విశ్వామిత్రుడు రాముడ్ని మరింత గుచ్చి గుచ్చి ప్రశ్నలు వేయసాగాడు. (సశేషం)

తన్ను తాను నిగ్రహించుకున్నవాడు అన్నిటినీ నిగ్రహించగలడు. –శ్రీస్వామీజీ




## 15వ అధ్యాయం ...ఐక్యదీక్ష

(గత సంచిక తరువాయి)

మండల దీక్ష సాగిపోతోంది. ఆశ్రమంలో కరెంటు గూడా లేకుండా స్వామీజీతోపాటు మరికొందరు భక్తులు గూడా రాత్రిళ్ళు చెట్ల కింద కాలక్షేపం చెయ్యసాగారు. కాని స్వామీజీ ఇలా మట్టినేలలో ఎన్నాళ్లు దొర్లాలి అని భక్తులకు ఆరాటం పెరగసాగింది. దానికి తగ్గట్టే ఒక రోజు కొంచెం వాన వచ్చింది. ఆ రోజు నిద్దరే లేదు స్వామీజీకి. దాంతో భక్తుల ఆరాటం పెరిగింది. గంగణ్ణ అనే ఒక గుమాస్తా ఇటికలు ఇచ్చాడు. నరసింహయ్య అనే మరో సామాన్యుడు ఒక ద్వారబంధం యిచ్చాడు. అనేక మంది శ్రమదానం చేశారు. తేనెటీగలు తేనె పోగుబెట్టినట్టుగా ఇందరు భక్తులు చేరి స్వామీజీ తలదాచుకునేందుకై రెండు గదుల చిన్న ఆజ్‌బెస్టాస్ రేకుల షెడ్డు నిర్మించగలిగారు. స్వామీజీ అభీష్టం మేరకు దీనిలోనే ఒక చిన్న భూగృహాన్ని గూడా కొండ రాళ్ళతో నిర్మించారు. ఈ నిర్మాణంలో ఒకే ఒక మేస్త్రీని పెట్టుకొని అతని కింద కూలీగా స్వామీజీ స్వయంగా పని చేశారనీ, ఆ యింటిని స్వయంగా నిర్మించారనీ ఈ నాడు చాలామందికి తెలియదు.

ఈ నిర్మాణ వ్యవహారం అంతా రామచంద్రశెట్టి అనే ఇంజనీరుగారి ఆధ్వర్యంలో జరిగింది. ఇల్లు ఏర్పడ్డది గాని, ఇంట్లో దీపం లేదు. కిరసనాయిలు దీపాలతోనే కొన్నాళ్ళు గడిచింది. ఒకనాడు కెసరే ఎలక్ట్రిసిటీ కాలనీ అధికారులు రాత్రిపూట ఇక్కడికి రావటం సంభవించింది. అప్పుడు వారు ఈ చీకటి పరిస్థితికి బాధపడి వెంటనే కరెంటు కనెక్షను ఇప్పించి, వైరింగు గూడా తమ స్వంత ఖర్చుతో చేయించారు. కరెంటు రావటంతో నూతనాశ్రమంలో కొంచెం వూపిరాడినట్టయింది. ఇక్కడి ఏర్పాట్లు యీ స్థితికి వచ్చేదాకా స్వామీజీ పరిస్థితి ఇంకా ఒక కాలు కెసరేలోనూ, ఒక కాలు ఆశ్రమంలోనూ అన్నట్లు సాగుతూ వచ్చింది. ఇక్కడ కాస్త యేర్పాటు కుదిరింది. స్వామీజీకి శ్రీశైలం వెళ్ళిరావాలనే తీవ్రమైన సంకల్పం బయలుదేరింది.

## శ్రీశైలశిఖరం

గణేశ టాకీసు వారి కారులో స్వామీజీ శ్రీశైలం బయలుదేరారు. అనంత రామభట్టుగారు, నాగప్పశెట్టిగారు కూడా ఆ కారులో వచ్చారు. బాబయ్య అనే డ్రైవరు కారు తోలుతున్నాడు. కారులో కూర్చున్న దగ్గరనుంచీ స్వామీజీ ముఖం గంభీరంగానే వుంది. అది గమనించి ఎవరూ ఏమీ మాట్లాడటం లేదు. కారు శరవేగంతో దూసుకుపోతోంది. తల ప్రక్కకు తిప్పి తలుపు కిటికీలోంచి కింది రోడ్డునే తీక్షణంగా చూస్తున్నారు స్వామీజీ. నిద్రపోవటం లేదు. సమాధిలోకి వెళ్ళలేదు. అయినా స్వామీజీ మాట్లాడటం లేదు. కారు సాగిపోతోంది. ఎదురుగా వాహనాలు వస్తున్నై. నేర్పుగా తప్పుకుంటోంది. కొన్ని వాహనాలను దాటి ముందుకు పోతోంది. ఒకోసారి ఏవో అడ్డులు వచ్చి అనుకోకుండా ఆగిపోతోంది. అయినా స్వామీజీ మాట్లాడటం లేదు.

అనంతపురంలో విశ్రాంతి తీసుకొని, మళ్ళీ ప్రయాణం సాగించింది కారు. రాత్రి ప్రయాణం. భట్టుగారు, శెట్టిగారు నిద్రలోకి జారుకున్నారు. దొర్నాల దాటింది. ఘాట్‌రోడ్డు మొదలైంది. స్వామీజీ మాత్రం కళ్ళు తెరచుకొని చూస్తూనే వున్నారు. కొండలు వస్తున్నాయి. లోయలు దాటి పోతున్నాయి. వాగులు అడ్డం పడుతున్నాయి. వంతెనలు దాటిస్తున్నాయి. మెలికలు వెనుకబడుతున్నాయి. మెరకలు క్రింద బడుతున్నాయి. వేగం హెచ్చుతోంది. దూరం తగ్గుతోంది. స్వామీజీ ముఖంలోని గంభీరత మారలేదు.

చూపులోనే మోక్ష పదవి ననుగ్రహించే శ్రీశైల శిఖరం దర్శనమైంది. కారు ఇంకా సాగింది. స్వామీజీ చరణ పల్లవం యుగయుగాలనాటి ఆ పెద్ద కొండను పులకించి, పరవశింప చేసింది. అయినా స్వామీజీ మాట్లాడలేదు.

ఒక సత్రపు గదిలో యేర్పాట్లు జరిగి ఉన్నాయి. భక్తద్వయం స్వామివారి సౌకర్యాలను చూసే ప్రయత్నంలో వున్నారు.

సూర్యుడు సముద్రగర్భాలను చీల్చుకొని ఉదయించే ప్రయత్నంలో వున్నాడు. ఉన్నట్టుండి గదిలోంచి బయటకు నడిచారు స్వామీజీ. ఒక చిన్న తుండు మొలకి చుట్టుకొని వున్న స్వామీజీ అలా బయటకి నడవటం చూసి కంగారుగా వెనుక వెళ్ళాడు భట్టుగారు. ఆ వెనుక వెళ్ళాడు శెట్టిగారు. వెనుక చూపులేకుండా చరచరా వెళ్ళిపోతున్నారు స్వామీజీ. పిలిచే దైర్యం గానీ, ఆపే ధైర్యం గానీ భక్తులిద్దరికీ లేదు. వీరు దాదాపు పరిగెత్తుతూ స్వామీజీ వెనుకాల నడుస్తున్నారు. స్వామీజీ రథవీధివైపు వెళుతున్నారు. అది దాటి మెట్లదారి పట్టారు. అప్పటికి వారు పాతాళ

గంగకు బయలుదేరారని అర్థమైంది. కాని స్వామీజీ స్నానానికి వస్త్రాలయినా తీసుకురాలేదే? ఏం చెయ్యాలి? స్వామీజీ పరిస్థితి మామూలుగా లేదు. అసలు నూతన ఆశ్రమానికి వచ్చిన దగ్గర నుంచీ వారి పద్ధతి అదోరకంగా వుంటోంది. సగం లోకంలో, సగం ధ్యానంలో వుంటున్నారు. అందులోనూ ఇప్పటి స్థితి మరీ కొత్తగా వుంది. ఇంకా కారుచీకటి. కొత్తచోటు. ఇలాంటి పరిస్థితిలో స్వామీజీని వదలి వెళ్ళటానికి ఇద్దరిలో ఎవరికీ ధైర్యం చాల్లేదు. ఏమయితే అదయింది లెమ్మని ఇద్దరూ స్వామీజీ వెంట నడువసాగారు.

భక్తులిద్దరూ కిందికి చూశారు. స్వామీజీ ప్రస్తుత స్వరూపం లాగానే ఆ దృశ్యం మనోహరంగానూ, భయంకరంగానూ వుంది. అయిదారు వందల అడుగుల లోతు లోయ అది. ఆ లోయలో అట్టడుగున ఉరకలు పెడుతున్న మహాప్రవాహం, చుట్టూతా ఆకాశం కనిపించనీయని మహావృక్షాలు. ఎటు చూసినా ఆకుపచ్చ చెట్లు, పైన దూరాన తెలుపు, ఎరుపు కలిసిన నీలాకాశం కళ్ళు తిరిగే లోతులో నల్లటి నీటిపాయ.

స్వామీజీ ఆ మెట్ల వెంబడి దాదాపు పరుగెత్తుతున్నారు. అది దుస్సాహసం. ఒక్కడుగు జారితే, అయిదువందల అడుగులు! ఎంత ప్రమాదమది! కాని సమర్థులకు సాహసమే క్రీడ. స్వామీజీ ఉరుకుల పరుగులమీద ముందుకు వెళ్ళిపోతున్నారు. రక్షణకై వారి వెనుకబడ్డ పెద్దలు వెనుకే పడిపోయారు. స్వామీజీ మెట్లని చూడటం లేదు. నింగినీ చూడటంలేదు. నేలనూ చూడటం లేదు. నీటినీ చూడటం లేదు. శరీరం పరిగెత్తేస్తోంది. ఆయన తాపీగా సాగిపోతున్నారు. పెద్దలు బాగా వెనుకబడ్డారు. స్వామీజీ కాళ్ళకు ఇసుక తగిలింది. మెట్లయిపోయాయన్నమాట. ఒక అరక్షణం నిలబడి యిటూ, అటూ చూశారు. అంతే, మళ్ళీ చరచరా సాగిపోతున్నారు. ఈ మాటు కాళ్ళు ఇసుకలో కూరుకుపోయి నడక కష్టంగా వుంది. అయినా వేగం తగ్గనీయటం లేదు స్వామీజీ. జనం అంతా స్నానాలు చేసే రేవులకు దూరంగా నడుస్తున్నారు. స్వామీజీ, పోయి పోయి ఒక చోట ఆగారు. అక్కడ నీటిలోకి దిగి బుడుంగున మునక వేశారు.

(సశేషం)

శ్రీఆనందరావు వెంకటసుబ్రహ్మణ్యంగారి నాన్నగారు
**శ్రీఆనందరావు రాధాకృష్ణమూర్తిగారు**
ది.31.10.2005 సోమవారంనాడు రేపల్లెలో స్వర్గస్థులైనారు.
**శ్రీగురుదేవుల కృపవల్ల వీరికి ఆత్మశాంతి చేకూరి ఉత్తమ సద్గతి కలుగు గాక!**

## శ్రీదత్తపాదుకా క్షేత్రం, అద్దంకివారి ఆహ్వానం

**అవధూత, జగద్గురువు, దత్తపీఠాధిపతి, నాదబ్రహ్మ, యోగబ్రహ్మ,**
**పరమపూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీవారి**
దివ్యకరకమలముల మీదుగా
**ది.02.02.2006 గురువారంనాడు ఉదయం 8-38 ని॥లకు**
**దత్తాత్రేయ అనఘాలక్ష్మి, విద్యాగణపతి దేవతల యంత్రప్రతిష్ఠతోపాటు,**
**విగ్రహప్రతిష్ఠ మరియు ఉదయం 11 గం॥లకు**
**మహాకుంభాభిషేక కార్యక్రమాలు నిర్వహించబడును.**
సా॥5 గం॥లకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానములో శ్రీస్వామీజీవారి దివ్యసందేశం ఉంటుంది. **అందరూ ఆహ్వానితులే.**

**కార్యనిర్వాహక కమిటీ, శ్రీశ్రీశ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమం,**
**గాంధీబొమ్మసెంటర్, అద్దంకి, (ప్రకాశంజిల్లా)**

### ఈ మాసంలో మన పర్వాలు

| | |
|---|---|
| 25.01.2006 బుధ | స్మార్తైకాదశి |
| 26.01.2006 గురు | రిపబ్లిక్‌డే, మాధ్వవైష్ణవైకాదశి, ఉన్మీలనద్వాదశి |
| 28.01.2006 శని | మాసశివరాత్రి |
| 30.01.2006 సోమ | మాఘ స్నానారంభము, గాంధీ వర్ధంతి |
| 02.02.2006 గురు | మదన పంచమి |
| 04.02.2006 శని | **రథ సప్తమి,** శ్రీ సూరప్ప పౌండరీక యాజిగారి ఆరాధన |
| 08.02.2006 బుధ | సర్వేషాం భీష్మైకాదశి |
| 12.02.2006 ఆది | సిద్ధరాజ దత్తావతారం (కొచ్చిన్), కుంభసంక్రమణం |
| 13.02.2006 సోమ | సింధుస్నాన పుణ్యదినం, **మహామాఘి** |
| 16.02.2006 గురు | సంకష్టహర చతుర్థి |
| 21.02.2006 మంగళ | అనఘాష్టమీవ్రతం |

బ్రహ్మ విష్ణు శివాత్మకమైన ఈ జగత్తంతా గురువే. గురువుకన్నా వేరేది లేదు. శ్రేష్ఠమైనది లేదు. అందువల్ల గురువునే పూజించాలి, గురువు సేవ చేయాలి, గురువునే అనుసరించాలి. — గురుగీతలో శివుడు

శ్రీమతి&శ్రీ జె.రాంబాబుగార్ల ప్రథమ పుత్రిక
**చి॥ల॥సౌ॥ మాధవి**
శ్రీమతి&శ్రీ అత్తలూరి మల్లికార్జునరావుగార్ల ద్వితీయ పుత్రుడు
**చి॥ శరత్‌చంద్ర** ల
వివాహం ది.14.12.2005 నాడు మైసూరు ఆశ్రమంలో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి వి.వెంకటసుబ్బమ్మ & కీ॥శే॥శ్రీ వి.వెంకటయ్యగార్ల ఏకైక పుత్రుడు
**చి॥ప్రవీణ్‌కుమార్**
శ్రీమతి&శ్రీ నిమ్మల చంద్రశేఖర్‌గార్ల ఏకైక పుత్రిక
**చి॥ల॥సౌ॥లలితాకుమారి** ల
వివాహం ది.07.12.2005 బుధవారంనాడు ఉరవకొండలో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీ వీక్కవిల్లి రామమూర్తి (రాంబాబు) గారి తృతీయ పుత్రిక
**చి॥ల॥సౌ॥శ్రీకన్య**
శ్రీ రాఘంమూడి వేదవెంకట సత్యనారాయణమూర్తిగారి జ్యేష్ఠ పుత్రుడు
**చి॥ రాజేష్** ల
వివాహం ది.17.11.2005 గురువారంనాడు విశాఖపట్నంలో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి&శ్రీ సంభర ప్రభాకరరంగార్ల కనిష్ఠ పుత్రుడు
**చి॥రవి**
శ్రీమతి&శ్రీ డి.కృష్ణారావుగార్ల పుత్రిక
**చి॥ల॥సౌ॥సౌమ్య** ల
వివాహం ది.22.12.2005 గురువారం రాత్రి విజయనగరంలో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

**పార్వతీ మూడులోకాలలోను దొరకని రహస్యం చెప్తున్నాను. విను. గురువే పరబ్రహ్మ, అంతకన్నా వేరే ఏది లేనే లేదు. ఇది ముమ్మాటికి నిజం.**
**– గురుగీతలో శివుడు**

కీ॥శే॥శ్రీకూచిభట్ల వెంకట గురునాథరాధాకృష్ణబాబూజీగారి ప్రథమ పుత్రిక
**చి॥ల॥సౌ॥ మాధురి**
శ్రీగొర్తి మారుతి వరప్రసాదరావుగారి ప్రథమ పుత్రుడు
**చి॥వెంకట శివనాగ పవన్‌కుమార్** ల
వివాహం ది.07.12.2005 బుధవారంనాడు విజయవాడలో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

**శ్రీలింగా పూర్ణచందర్‌గుప్తా & శ్రీమతిలింగా విజయలక్ష్మిగార్లు**
**20వ పెళ్ళిరోజును** ది.15.12.2005 నాడు హైదరాబాదులో జరుపుకున్నారు.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి&శ్రీకుమ్మరగుంట సుదర్శనంగార్ల ఏకైక పుత్రుడు
**చి॥నాగరాజు (ప్రవీణ్‌కుమార్)**
కీ॥శే॥శ్రీకేదారిశెట్టి చలమయ్యశెట్టిగారి ఏకైక పుత్రిక
**చి॥ల॥సౌ॥వనిత** ల
వివాహం ది.11.12.2005 ఆదివారంనాడు నర్సీపట్నంలో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి&శ్రీకైతేపల్లి వెంకటేశ్వర్లుగార్ల ఏకైక పుత్రుడు
**చి॥హరికుమార్**
శ్రీపవిత్రరాయ్‌గారి కనిష్ఠ పుత్రిక
**చి॥ల॥సౌ॥లక్ష్మిమితరాయ్** ల
వివాహం ది.09.12.2005 శుక్రవారంనాడు తిరుమలలో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి&శ్రీచిక్కాల గాంధిగార్ల ద్వితీయ పుత్రుడు
**చి॥రమేష్**
శ్రీవీరవల్లి సూరయ్యగారి ద్వితీయ పుత్రిక
**చి॥ల॥సౌ॥సుజాత** ల
వివాహం ది.26.11.2005 శనివారంనాడు హైదరాబాదులో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**




శ్రీశంకర భగవత్పాదాచార్యకృత స్తోత్రానికి
సరళ వ్యాఖ్యానము
**శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ**

గోవింద అంటే "పశుపతి" అని కూడా అర్థం చెప్పుకోవచ్చు. ఈ విధంగా శివకేశవుల అభేదాన్ని తెలుపుతున్నారు.

మహాభారతంలో శ్రీకృష్ణుడు -

**రుద్రో నారాయణశ్చైవ-**

**త్వేకం సత్త్వం ద్విధాకృతమ్॥**

**లోకే చరతి కౌంతేయ!**

**వ్యక్తిస్థం సర్వకర్మసు॥**

**అర్జునా! ఆ పరమాత్మయొక్క శుద్ధసత్త్వమొక్కటే శివకేశవులు అని రెండుగా అయి వుంది అని ఉపదేశించాడు.**

ఈ శ్లోకంలో "డుకృఞ్‌కరణే" అని ప్రయోగించడానికి ఒక కథ ఉందని చెప్తారు. శంకరాచార్యస్వామి ఒకసారి గంగానదిలో స్నానం చేసి పైకి వస్తున్నారు. ఆ సమయంలో ఒక వ్యాకరణ పండితుడు స్నానఘట్టంలో పై మెట్టుపై కూర్చుని శిష్యుడిచేత వ్యాకరణ సూత్రాలు వల్లె వేయిస్తున్నారు. పిల్లవాడికి సరిగ్గా నోరు తిరగటం లేదు. గురువుగారు పదే పదే చెప్పిస్తున్నారు.

ఈలోగా గురువుగారి పక్కన ఉన్న నీళ్ళ బిందె కిందపడి దొర్లుకొంటూ శంకరాచార్యస్వామి దగ్గర పడింది. ఆ బిందె దొర్లుతుంటే "డుకృఞ్‌కరణే, డుకృఞ్‌కరణే" అనే శబ్దం వస్తోంది. (అంటే ఈ వ్యాకరణ పండితుడి సూత్రాలు బిందెకు కూడా వంటబట్టాయన్న మాట) ఇది చూసి శంకరులకు "అయ్యో! ఈ మానవులు సత్య పదార్థాన్ని గుర్తించలేక కేవలం పొట్టకోసమే బతుకుతున్నారే" అని బాధ కలిగింది. వెంటనే ఆ వ్యాకరణ పండితుడికి "భజగోవిందం భజగోవిందం" అని ఉపదేశించారని చెపుతారు.

ఈ శ్లోకంలో "భజగోవిందం" అని మూడుసార్లు చెప్పటానికి కూడా కారణం లేకపోలేదు.

మొదటి భజగోవిందం ధర్మాన్ని బోధిస్తోంది. రెండవ భజగోవిందం భక్తిని గురించి చెపుతోంది. ఇక మూడవ భజగోవిందం మోక్షమార్గాన్ని పట్టుకోమని ఉపదేశిస్తోంది. భజ అంటే భజించు, సేవించు, ఆశ్రయించు, చేరిపో అనే అర్థాలు ఉన్నాయి.

ఇక్కడ మనకు నీతిమాలలోని మొదటి శ్లోకం గుర్తుకు వస్తుంది.

**ఉత్తీర్య దూరాదపయాతుమిచ్ఛుః**
**సఖే దురభ్యాసవనాత్ యదిత్వం।**
**శ్రీవిష్ణు సంకీర్తన సాధుసంగౌ**
**విధాయ పక్షావివ రాజహంసః॥**

**భావం :** దురభ్యాసాలు కారడవిలాంటివి. వాటిలోంచి పారి పోవటం కష్టం. రెక్కలు కట్టుకొని యెగిరి దూరంగా పోవటమే మంచిపని. సత్సంగము, దివ్యనామ సంకీర్తన అన్నవే ఆ రెక్కలు. వాటిని నీవు ధరిస్తే నీవు రాజహంస లాగా దురభ్యాసమనే అడవిని తప్పించుకొని మానస సరోవరానికి చేరగలవు.

తప్పులు అనేకం చేస్తూ వుండటం మానవనైజం.

**తెలిసి చేసే తప్పులు మరింత ఎక్కువ దుష్ఫలితాలనిస్తాయి.** నిజమే. కానీ తప్పును చేస్తున్నప్పుడు "ఇది తప్పు–నేను దీనిని మానలేక పోతున్నాను" అని గుర్తు చేసుకుంటూ వుండటం ఆ తప్పును జయించేందుకు దగ్గరి దారి.

ఈ గుర్తింపు మీకు కలగాలంటే మీరు ఉత్తములయిన వారితో స్నేహం చెయ్యాలి. కలిగిన యీ గుర్తింపు మీకు మళ్ళీ మళ్ళీ గుర్తు రావాలంటే–మీరు దివ్యనామ సంకీర్తన చేసే అలవాటు పెంచుకోవాలి.

మంచి స్నేహం, నామసంకీర్తన, అన్న ఈ రెండింటిలో దేనిని వదిలేసినా మీకు కలిగే గుర్తింపు తప్పును సమర్థించేదిగా మారిపోతుంది. దానివల్ల తప్పు మరింత గట్టిపడుతుంది.

**అందుకే సాధుసంగం, భగవన్నామకీర్తన చాలా ముఖ్యమైనవి.**

(సశేషం)

# అమ్మవొడికి బలం చేకూర్చండి

అమ్మవొడి! ఇది నిస్వార్థ ప్రేమకు సంకేతం!

అమ్మవొడి! ఇది హైదరాబాదులో మన గురుదేవులు స్థాపించిన వృద్ధాశ్రమం! వార్ధక్యం మనిషికి శాపం కారాదనీ, అది జీవితంలో సమస్యలతో కూడిన వ్యర్థసమయం కారాదనీ, భావించి వార్ధక్యానికి సార్థక్యాన్ని కల్పిస్తూ శ్రీస్వామీజీ నిర్మించిన నూతన సంవిధానమే **"అమ్మవొడి"**! ఎందరో వృద్ధులు ఇక్కడ తమ జీవితాన్ని ఆధ్యాత్మికంగా మార్చుకొని, జగన్మాత స్వరూప పూజ్య శ్రీస్వామీజీవారి సంరక్షణలో మును పెరుగని ఆనందాన్ని అనుభవిస్తున్నారు.

శ్రీస్వామీజీ స్థాపించిన ఈ వ్యవస్థ ఇలా నిరంతరంగా సాగిపోవాలంటే, **భక్తులందరూ అమ్మవొడికి సమృద్ధిని కలిగించి, బలం చేకూర్చాలి.** ఇందుకు సులభమార్గంగా శ్రీస్వామీజీ ఒక పథకం రచించారు. మీరు ఇళ్లల్లో పుట్టినరోజు పండుగలు, పెళ్లిరోజు పండుగలు, పితృదేవతల స్మరణ దినాలు, నూతన వ్యాపార ప్రారంభాలు, ఇలాంటి సందర్భాలు ఏవి కూడా నిర్వహించుకున్నప్పటికీ, ఒకసారి మన అమ్మవొడిని, అక్కడి వృద్ధులను జ్ఞాపకం చేసుకుని, రూ. 2000– విరాళంగా అందించండి. అమ్మవొడిలో ఆరోజు అన్నదానం మీ పేరున జరుగుతుంది. **అందరికీ వృద్ధాప్యం వస్తుంది. ప్రస్తుతం మీరు వృద్ధులను ఆదుకుంటే, వృద్ధాప్యంలో మీకు మంచి జరుగుతుంది.**

ఆ రోజు హైదరాబాదు దత్తపీఠంలో మీ పేరున పూజ జరుగుతుంది. మీరు స్వయంగా రాగలిగితే, 5 మంది వరకు మీ కుటుంబసభ్యులు అమ్మవొడిలోనే భోజన ప్రసాదం తీసుకోవచ్చు. మీకు రావడం కుదరకపోతే మంత్రాక్షతలు పోస్టులో మీ దగ్గరకు వస్తాయి. ఈ సేవ మీ తరతరాలకు అన్నోదకాలకు లోటు రానీయని నిధిగా, మీ వెంట నిలబడుతుంది. మీరు కోరిన రోజున ఈ సేవను పొందవచ్చు. మీరు డి.డి. లు ఎస్.జి.ఎస్. అవధూత దత్తపీఠం ట్రస్టు (R) పేరున, హైదరాబాదులో చెల్లింపబడే విధంగా తీసి, వాటిని క్రింది అడ్రసుకు పంపించగలరు.

**అమ్మవొడి, ఎస్.జి.ఎస్. అవధూత దత్తపీఠం**
**ఏర్‌ఫోర్స్ అకాడమీ రోడ్,**
**దుండిగల్, హైదరాబాదు – 500043.**
**ఫోన్ నెం : 08418 – 255123**

# అనుభవాలు

## శ్రీవి.సుదర్శన్‌రెడ్డి, మైసూరు ఆశ్రమవాసి

పూజ్య శ్రీస్వామీజీవారి జన్మస్థలమైన, అటవి ప్రాంతమైన, మేకెదాటు ఆశ్రమంలో వేలాది మందికి వసతి సౌకర్యం లేనందున, శ్రీస్వామీజీవారి ఆజ్ఞానుసారం ఆనాటి కుంభాభిషేక కార్యక్రమంలో పాల్గొనడానికి, ది.18.12.2005 నాడు ఉదయం 6-30 గం॥లకు 10 బస్సులలో, దత్తజయంతికి వచ్చిన దేశ విదేశీ భక్తులతోపాటు నేను కూడా, మైసూరు ఆశ్రమం నుండి బయలుదేరి వెళ్ళడం జరిగింది. సుమారుగా ఉదయం 10-30 గం॥ల సమయంలో, మేకెదాటు ఆశ్రమానికి 2 కి.మీ. దూరంలోని ఘాట్‌రోడ్డులో ఉన్నాం. మాకు ముందుగా ఉన్న ఒక బస్సు ఘాట్‌రోడ్డులోని ఒక మలుపులోని పిట్టగోడను కూల్చివేసి, కొద్దిలో ప్రమాదం నుండి బయటపడి, కొంచెం ముందుకు వెళ్ళి రోడ్డుపై నిలచింది. ఆ బస్సు వెనుకనే ఉన్న మా బస్సు రోడ్డు మలుపులో పట్టుతప్పి, ఘాట్‌రోడ్డు దిగి లోయలోకి బోల్తాపడింది.

ప్రమాదాన్ని గుర్తించిన బస్సులోని భక్తులందరూ "గురుదత్తా-గురుదత్తా, దత్తా-దత్తా, స్వామీజీ-స్వామీజీ" అని ఆందోళనతో, ముక్తకంఠంతో వేడుకున్నారు. మైసూరు ఆశ్రమంలో గురుసేవలో భాగంగా భక్తిమాలసేవలో ఉన్న నాకు మాత్రం ఆ సమయంలో ఎలాంటి ఆందోళన గానీ, భయం గానీ అనిపించలేదు. ఎన్నో సందర్భాలలో, ప్రయాణ సమయాలలో, విపత్కర సంకట సమయాలలో, ఎంతో మందిని, ఎన్నో విధాలుగా ప్రమాదాలబారి నుండి మన పూజ్య గురుదేవులు ఆదుకొని కాపాడి ఉండుట మనకు నిదర్శనమే, చిరపరిచితమే. ఆ ధైర్యంతోనే, ఆ నమ్మకంతోనే నేను కూడా దత్తస్మరణ చేస్తూనే ఉన్నాను. ప్రమాదం నుండి బయటపడుతామని అంతరంగంలో నాకు దృఢ విశ్వాసం ఉన్నది. అదే జరిగింది.

దత్తదేవుడి నిత్యసంచారం ఉన్న ఆ స్థలంలో, శ్రీస్వామీజీవారి జన్మస్థలప్రాంతంలో, దత్తుడి కుంభాభిషేకానికై బయలుదేరిన సందర్భంలో, అక్కడికి సమీపంలోనే శ్రీస్వామీజీవారు ఉన్న సన్నివేశంలో, స్మరణ మాత్రాన సంతుష్టుడయ్యే ఆదిగురువు దత్తాత్రేయస్వామి, అపర దత్తాత్రేయ స్వరూపులైన మన పూజ్య గురుదేవులు మమ్మల్ని అందరినీ ఆ ఘోర ప్రమాదం నుండి కాపాడారు. బస్సు 2 సార్లు పల్టీలకు గురి అయి మూడవపల్టీ సగంలో, అనగా ఒక ప్రక్కగా ఒరిగి, ఔదుంబర వృక్షానికి ఆనుకుని ఆగిపోయింది. లేనిచో ఆ బస్సు ఇంకా ఎన్నో

పల్టీలకు గురి అయి ఎంతో ప్రాణనష్టం సంభవించి ఉండేది. 55 మంది ప్రయాణిస్తున్న ఆ బస్సులోని వారందరూ స్వల్పగాయాలతో బయటపడటానికి ఆ దత్తకృపే, గురుదేవులకృపే కారణం. ఆ ఔదుంబరవృక్షం చిన్నది. జారుడుగా, ఏటవాలుగా ఉన్న ఆ స్థలంలో బస్సును ఆపగలిగినంత బలిష్ఠమైనదికాదు. కానీ బస్సు ఆగింది. కారణం అక్కడ వృక్షం చిన్నది అయినప్పటికీ, అదృశ్యరూపంగా అక్కడ ఉన్నది కొండంత దత్తదేవుడు. అప్పటికే "బస్సు కొద్దికొద్దిగా జారుతున్నది, త్వరగా వెళ్ళండి" అని అక్కడ చెప్పారు. అయినా, సాయంత్రం మా తిరుగు ప్రయాణంలో చూసేవరకు బస్సు అదేచోట ఆగివుండటం ఆశ్చర్యకరమే. అందుకే ఔదుంబర వృక్షంలో దత్తాత్రేయస్వామి ఉంటారనీ, ఔదుంబరవృక్షాన్ని పెంచుకోవాలనీ, అప్పుడప్పుడు శ్రీస్వామీజీవారు చెప్తూవుంటారు.

బస్సులో ఉన్న నా సోదరి శ్రీమతి బి.విజయలక్ష్మి తలకు, కాలుకు కొంచెం గాయాలు అయినాయి. అలాగే ఆశ్రమవాసి, ప్రార్థనామందిరం ఇన్–ఛార్జిగా వున్న శ్రీనివృత్త దత్తపాదరేణువుగారికి, మరికొంత మందికి గాయాలు అయినాయి. **"బ్రేయిలిలిపిలో"** సుమారుగా 40 పుస్తకాల మాధ్యమముగా శ్రీస్వామీజీవారి చరిత్రను, భజనలను, ఉపన్యాసాలను అంధులకు అందించి, క్రితం జన్మదినోత్సవాలలో ఆస్థాన విదుషి బిరుదు గ్రహీత శ్రీమతి బి.యాదేశ్వరిగారికి మరియు చెన్నైకి చెందిన 75 సంవత్సరాల వయస్సుగల శ్రీరాజగోపాలన్‌గారికి మాత్రం ఎడమచేతి ఎముక స్వల్పంగా విరగడం (mild fracture) జరిగింది. నాకు, నా సోదరి భర్త శ్రీలచ్చిరెడ్డిగారికి, మిగిలిన చాలా మందికి అత్యంత స్వల్పమైన గాయాలు మాత్రమే అయినాయి. బస్సుడ్రైవర్ ప్రక్కనే పొడవుగా ఉన్న సీటులో కూర్చున్న, శ్రీస్వామీజీవారికి విశేష సేవలందించిన శ్రీఆదిశేషాచారిగారు (మైసూరు), ఆయన కుటుంబ సభ్యులు ముగ్గురూ, బస్సు ఆగిన సమయంలో ఎలాంటి గాయాలు లేకుండా నేలపై పడిఉన్నారట. విచిత్రంగా ఇది ఎలా జరిగిందో వారికే తెలియదు అని అన్నారు.

ఈ ప్రమాదం జరిగిన సమయంలో శ్రీస్వామీజీవారు ఆశ్రమంలో శ్రీచక్రపూజను నిర్వహిస్తున్నారట. గాయపడిన వారిని అంబులెన్సులో ఆశ్రమానికి తీసుకు వెళ్ళి, విదేశీ భక్తుల నిమిత్తం ఏర్పాటుచేసిన 30 మంచాలలోని పరుపులలో పడుకోబెట్టినారు. ఈ విధంగా ఆ అటవి ప్రాంతంలో బెడ్‌ల ఏర్పాటు ముందుగానే జరిగింది. శ్రీస్వామీజీవారు వచ్చి గాయపడినవారిని పలుకరించి, తన అమృత హస్తాలతో వారిని స్పర్శించారు. శ్రీబాలస్వామీజీవారు అందరికీ పూజాశీర్వాన్ని అందించారు. శ్వేతార్క హోమరక్షలను కూడా అందరికీ ఇవ్వడం, కట్టడం జరిగింది. డాక్టర్లు వచ్చి గాయపడిన వారికందరికీ ప్రాథమిక చికిత్సను

నిర్వహించారు. కొంచెం ఎక్కువగా గాయాలు అయినవారికి అవసరమైతే స్కానింగ్ చేయించి, చికిత్సను చేయించే నిమిత్తం, శ్రీస్వామీజీవారి ఆజ్ఞానుసారం వారిని వ్యానులలో బెంగుళూరులోని ఆసుపత్రికి తరలించారు.

నేను మరియు స్వల్పగాయాలు అయిన వారు అందరూ మేకెదాటులో కుంభాభిషేకాన్ని చూడటం, నేను భక్తిమాలకు రిపోర్ట్ వ్రాసుకోవడం కూడా జరిగింది. అందరూ దత్తభక్తులే కావడం, దత్తుడు అక్కడ ఉండి కాపాడటం వలననే ప్రమాదం నుండి బయటపడినారని శ్రీస్వామీజీవారు చెప్తూ, ఇదే ప్రమాదం వేరే చోట జరిగి వుంటే పరిస్థితి తీవ్రంగా ఉండి ప్రాణాపాయం జరిగి వుండేదనీ, కొందరి తీవ్రకర్మ కారణంగా ఆ బస్సులో ప్రయాణించిన మిగిలిన వారు కూడా, వారి వారి కర్మానుసారం ఈ స్థితిని అనుభవించక తప్పలేదనీ, ఈ విధంగా అందులో ప్రయాణించిన వారందరికర్మ దత్తకృపవల్ల సూక్ష్మరూపంగా నివారణ జరిగి, ప్రాణాలతో బయటపడినారని అన్నారు.

బెంగుళూరులో అవసరమైన వారికి ఎక్స్‌-రే పరీక్షలు నిర్వహించి, స్వల్పంగా ఎముకలు విరిగిన ఇద్దరికి పట్టీలువేసి, మిగిలినవారికి అవసరమైన చికిత్సను చేశారు. ఆ రోజు రాత్రి వారిని బెంగుళూరు ఆశ్రమంలో విశ్రాంతి చేయించి, ది.19.12.2005 నాడు ఉదయం మైసూరు ఆశ్రమానికి తీసుకురావడం జరిగింది. వారినందరిని శ్రీస్వామీజీవారు పరామర్శించారు. స్వల్పగాయాలే అవడంచేత, అదేరోజు వారిలో చాలా మందికి రైల్వే రిజర్వేషన్ ఉండటంచేత, నా సోదరి, చేతి ఎముక విరిగిన శ్రీమతి యాదేశ్వరి, శ్రీరాజగోపాలన్ గార్లతో సహా శ్రీస్వామీజీవారి ఆశీస్సులతో, అనుమతితో, దాదాపు అందరూ ప్రయాణమై వెళ్ళిపోయారు. శ్రీరాజగోపాలన్‌గారు ఆ ప్రమాదకర స్థితిలో ఇది అసలు గాయమే కాదని అనడం, శ్రీమతి యాదేశ్వరిగారు ఈ విరామ సమయంలో నా కుడి చేతితో ఇంకా శ్రీస్వామీజీవారి రచనలు "బ్రెయిలిలిపిలో" చేస్తాననడం విశేషం.

రెండవ రోజు ఉదయం వీరి ప్రయాణమే తెలియజేస్తోంది, వీరి గాయాలు స్వల్పం అని. ఈ విధంగా దత్తకృపతో, సద్గురువుకృపతో దత్తభక్తులు కాపాడబడినారు అని తెలియజేయడానికి సంతోషిస్తూ, గురుదేవులకు, గురుదత్తదేవులకు కృతజ్ఞతాభివందనాలతో సెలవు తీసుకొంటున్నాను. ✿ ✿ ✿

**శ్రీస్వామీజీ సాక్షాత్ జగద్గురువు. త్రిమూర్తి స్వరూపమైన దత్తాత్రేయ స్వరూపం. ఆయన సాన్నిధ్యంలో సమస్త శుభాలను, పరమ ప్రశాంతిని మనం పొందగలం.**

# అఖిలభారత ఆయుర్వేద సదస్సు

శ్రీస్వామీజీవారి దివ్యాశీస్సులతో నడుస్తున్న SERVE సంస్థ ఆధ్వర్యంలో,

**2006 ఫిబ్రవరి 16, 17 తేదీలలో హైదరాబాదులోని తిలక్ రోడ్‌లో గల భారతీయ విద్యాభవన్ హాలులో** "Ayurvedic Medicare as Evidence Based Medicine" అనే అంశంపై అఖిలభారత సదస్సు జరుగనున్నది. అఖిలభారత స్థాయి కీర్తి గల ఆయుర్వేద ప్రముఖులు అనేకులు దీనిలో పరిశోధన పత్రాలను సమర్పించటానికి అంగీకరించారు.

**ఇప్పటివరకూ అంగీకరించిన ప్రముఖులు :**

**1. Dr. I.Sanjeeva Rao, 2. Dr.Ranjit Roy Choudhury, 3. Dr.S.R.Narahari, 4. Dr.Rangesh Paramesh, 4. Dr.J.L.N.Sastry, 5.Dr. R.L.Mahadevan, 6.Dr. Jyhotishi, 7. Dr.V.K.Joshi, 8. Dr.Ravishankar, 9. Dr.Ranganathan, 10. Dr. N.B.Prabhu, 11. Dr.Anjaneya Murthy, 12. Dr.Eswara Reddy, 13. Dr.A.Siva Rama Krishna, 14. Dr.Surinder Katoch, 15.Dr.Paramkusha Rao, 16.Dr.B.M.Hegde, 17.Dr.Pandey.**

ఈ సదస్సులో డెలిగేటుగా పాల్గొన దలచినవారు "SERVE" పేరిట రూ. 200/- లకు హైదరాబాదులో చెల్లింపయ్యే విధంగా Bank DD తీసుకొని SERVE సంస్థ అడ్రస్సుకు పంపాలి. డెలిగేట్లుగా వచ్చే వారికి డార్మెంటరీ వసతి సౌకర్యం కలిగించబడును. సంస్థ అడ్రసు: H.No. 11-13-279, Road No. 8, Alakapuri, Hyderabad - 500035.

**(ఫోన్ నెం : 040/24035013)**

సదస్సు లక్ష్యాలు:

1. వర్తమాన వ్యాధినివారణ వ్యవస్థలో ఆయుర్వేద ఆవశ్యకతను గురించి చర్చించుట.

2. ఈనాటి వ్యాధి నివారణ వ్యవస్థలో సమగ్ర భాగంగా, సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా, ఆయుర్వేదాన్ని రూపొందించటానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించుట, చర్చించుట.

3. ఆయుర్వేద వైద్య ప్రక్రియలో సాక్ష్యాధారాల సేకరణకు, వాటి వేశ్లేషణకు, గల ప్రాధాన్యాన్ని గురించి ఆయుర్వేద పరిశోధకులకు, ఆ వైద్యాన్ని అమలు పరిచే వైద్యులకు, నొక్కి వక్కాణించుట.

4. ఈనాటి కొన్ని అధునాతన వైద్య సమస్యల పరిష్కారాల కోసమై “ఇంటర్ డిసిప్లినరీ” పరిశోధనలను, చికిత్సా వ్యవస్థలను, ప్రోత్సహించ గల వేదికలను నిర్మించుట.

5. పై లక్ష్యాల సాధనకై ఆయుర్వేద పరిశోధనా కేంద్రాలను, చికిత్సా కేంద్రాలను, ప్రోత్సహించుట.

**సదస్సులో ప్రధాన చర్చనీయాంశములు:**

1. **Establishing Ayurvedic Medicinal Evidence :** Ayurvedic Authority, Applicability, Scope and possibility, Area of work, Standardization of Therapeutics, Drug Standardization, Nomenclature Standardization -for wide acceptance nationally and globally

2. **Ayurvedic Potential :** Potential of Ayurveda in solving some of the Riddles of Current Bio-Medicine

3. **Health & Harmony:** Comprehensive Care for Diseases of Civilisation (obesity, Diabetes SyndromX, Heart Diseases, Immunological disorders, Mental Health etc.,)

4. **How to Practice Ayurveda :**Challenges before Ayurvedic Education, Practice - Solutions

## ఆయుర్వేదాభిమానులందరూ ఆహూతులే!

**For further details & Research papers, please visit our website: www.serveveda.org**

# సంక్షిప్తవార్తలు

**నివేదిక/సేకరణ : స్టాఫ్ కరెస్పాండెంట్**

ది. 27.11.2005 నాడు నాదమంటపంలో దాససాహిత్యంలో భాగంగా, రాష్ట్రస్థాయిలో జరిగిన కార్యక్రమంలో, శ్రీపురందరదాసు, శ్రీవిజయదాసు, శ్రీకనకదాసుల కీర్తనలను శ్రీస్వామీజీవారి సమక్షంలో, అధిక సంఖ్యలో హాజరు అయిన శ్రోతల సమక్షంలో, ప్రముఖ గాయకులు నాదమంటపంలో 4 గంటల పాటు అద్భుతంగా గానం చేశారు. నాదమంటపంలో స్థలం సరిపోనందున పౌండరీక రంగస్థలంలో తెర(Screen) ఏర్పాటుచేసి కార్యక్రమాన్ని relay చేశారు.

❋ ❋ ❋

పూజ్య శ్రీస్వామీజీవారు రచించిన, కలియుగ భగవద్గీత అనబడే "నీతిమాల"లోని శ్లోకాలపై, ప్రతి సంవత్సరం పాఠశాలల విద్యార్థుల మధ్య మైసూరు ఆశ్రమంలో నిర్వహించబడే కంఠస్థ పఠనపోటీ కార్యక్రమంలో భాగంగా, ది.02.12.2005 నాడు 6వ సంవత్సర పోటీకార్యక్రమాన్ని, విశ్వప్రార్థనామందిరంలో ఉదయం 10 గం॥లకు జ్యోతిప్రజ్వలనంతో శ్రీస్వామీజీవారు ప్రారంభించారు. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు విడివిడిగా ఈ పోటీని నిర్వహించడం జరిగింది. మైసూరు విశ్వవిద్యాలయానికి చెందిన కన్నడ అధ్యయనసంస్థ మాజీడైరెక్టర్ డా॥టి.వి.వెంకటాచలపతిశాస్త్రిగారు, సాయంత్రం జరిగిన కార్యక్రమంలో బహుమతులను అందజేశారు. ప్రతి విభాగంలో 5 ప్రధాన బహుమతులను పతకాలతోపాటుగా, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు, రూ 1000/ నుండి రూ.400 వరకు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రూ. 800 నుండి రూ.300 వరకు, నగదు బహుమతులను కూడా అందజేశారు. ప్రోత్సాహక నగదు బహుమతులను, రోలింగ్ పతకాలను కూడా అందజేశారు.

ఆధ్యాత్మికచింతన పెరుగడానికి, సనాతనధర్మ పరిరక్షణకు, లోకకళ్యాణార్థం, భారత సంస్కృతిని పరిఢవిల్లజేయడానికి, ఇలాంటి నీతిబోధల కార్యక్రమాన్ని శ్రీస్వామీజీవారు నిర్వహిస్తూ, ప్రోత్సాహకరంగా విశేష నగదు బహుమతులను కూడా అందజేస్తున్నారని శ్రీవెంకటాచలపతిశాస్త్రిగారు తమ ప్రసంగంలో

శ్రీస్వామీజీవారి కృషిని ప్రస్తుతించారు. నిత్యజీవితంలోని వ్యాపారరంగంలో, ఉద్యోగాలలో, అన్ని రంగాలలోనూ, అన్ని సందర్భాలలోనూ ధర్మాన్ని అందరూ విధిగా ఆచరించాలని ఆయన అభిలషించారు. ఈ సందర్భంగా శ్రీస్వామీజీవారు ప్రసంగిస్తూ, భగవద్గీతలోని, నీతిమాలలోని శ్లోకాలను, శ్రీస్వామీజీవారు రచించిన సులభమైన భజనలను, చుటుకు (చిన్న చిన్న) పద్యాలను కంఠస్థం చేయాలని, తద్వారా ధారణాశక్తిని పెంపొందించుకోవాలని ఉద్బోధించారు. శ్రీస్వామీజీ రచించిన చుటుకు సాహిత్య కన్నడ పుస్తకాలను పాఠశాలల ఉపాధ్యాయులకు శ్రీస్వామీజీవారు స్వయంగా అనుగ్రహించారు. ఈ విధంగా ఇలాంటి పోటీలను ప్రతి ఆశ్రమశాఖలోను ఏర్పాటు చేసుకొని, విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందింపజేయవచ్చును.

✲ ✲ ✲

ది.03.12.2005 నాడు మైసూరు నుండి బయలుదేరి, శ్రీస్వామీజీవారు థాయిలాండ్‌లో పర్యటించి, ది.07.12.2005 రాత్రి మైసూరు ఆశ్రమానికి తిరిగి చేరుకున్నారు. 08.12.2005 నాడు ఉదయం విశ్వప్రార్థనామందిరంలో తమ ప్రసంగంలో థాయిలాండ్ ప్రజల భక్తిని, క్రమశిక్షణను మెచ్చుకుని, ఈ విషయంలో వారి నుండి మనం ఎంతో నేర్చుకోవాల్సి ఉందని శ్రీస్వామీజీవారు ఉద్బోధించారు. గుడిలోని గంటల శబ్దానికి విసుగు చెందకూడదని చెప్తూ, గంటలు మరియు వాటి శబ్దం శుభచిహ్నాలు అని పేర్కొంటూ, అవి క్రమశిక్షణకు ప్రతిరూపం అని శ్రీస్వామీజీ అన్నారు. థాయిలాండ్ దేశప్రజలు మొదటగా ఆర్యన్లు అని, తదుపరి వారు బౌద్ధమతాన్ని స్వీకరించారని తెలియజేస్తూ, వారికి రామాయణంపట్ల భక్తిశ్రద్ధలున్నాయని, రామాయణంలోని పేర్లను కూడా వారు పెట్టుకుంటున్నారని శ్రీస్వామీజీవారు తమ ప్రసంగంలో ప్రస్తుతించారు.

✲ ✲ ✲

ది.10.12.2005 నాడు సాయంత్రం నాదమంటపంలో హాస్యోత్సవ కార్యక్రమాన్ని కన్నడభాషలో నిర్వహించారు. మొదటగా హాస్యకవితలను శ్రీస్వామీజీవారు వినిపించి అందరిని నవ్వించారు. అధిక సంఖ్యలో హాజరు అయిన ప్రేక్షకుల సమక్షంలో నిర్వహింపబడిన 3 గంటల కార్యక్రమంలో శ్రీస్వామీజీవారు మరియు హాజరు అయిన ప్రేక్షకులు కడుపుబ్బ నవ్వుతూ ఆనందించారు.

✲ ✲ ✲

ముంబాయికి చెందిన దంపతులు శ్రీనికుంజ్‌పరేఖ్, శ్రీమతి జ్యోతీపరేఖ్ గార్లు బోన్సాయ్ శిక్షణా తరగతులను ది.11.12.2005 నుండి ది.12.12.2005 వరకు, దత్తపీఠంలోని కిష్కింధా బోన్సాయ్ మూలికావనంలో నిర్వహించారు. బోన్సాయ్ వృక్షాలను ఏ విధంగా pruning (ఎక్కువగా పెరిగిన కొమ్మలను కత్తిరించి సరిచేసే విధానం) చేయాలనే విషయాన్ని ప్రత్యక్షంగా చూపిస్తూ, రెండు రోజుల సమయంలో 6 విధాలుగా ప్రకృతి పరంగా అలంకరించే విధానాన్ని, 6 రాతి ఫలకలపై అందంగా కూర్చి, ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ శిక్షణాతరగతులను మధ్య మధ్యలో సందర్శించి, ఆ నైపుణ్యతను శ్రీస్వామీజీ అభినందించారు.

జపాన్‌దేశంలో రెండవ ప్రపంచయుద్ధ సమయంలో అణుబాంబుల వలన ఎంతో వినాశం జరిగినప్పటికీ, ఒక రకమైన చెట్టుకు ఏమీ కాలేదని చెప్తూ, ఆ చెట్టును స్వామీజీ చూశారని తెలియజేస్తూ, చెట్లు మన పిల్లల వంటివి అని పేర్కొంటూ, అవి మనలోని ఆలోచనలను సరిదిద్దుతాయని శ్రీస్వామీజీ అన్నారు. ఈ వనంలోని ఒక్కో చెట్టు మన శరీరంలోని ఒక్కో నరానికి సంబంధించి విశేషమైనవే గాక, అవి శక్తిని ప్రసరిస్తూ, మనలోని 72000 నాడులకు, అందులోని అతి ముఖ్యమైన 14 నాడులకు మంచి శక్తిని ప్రసాదించడంచేత, వాటి తరంగాల ప్రభావం వలన మనలోని దుష్ప్రభావాలు, రుగ్మతలు దూరమై, శారీరక మరియు మానసిక ఆరోగ్యాలు మెరుగుపడుతాయని శ్రీస్వామీజీ అన్నారు. ఈ విధంగా ఈ మూలికావనం వైకుంఠంతో సమానమైనదని తెలియజేస్తూ, ప్రతి ఒక్కరూ కనీసం ఒక బోన్సాయ్ వృక్షాన్నైనా పెంచుకొని వాటితో స్నేహం చేయాలని శ్రీస్వామీజీ ఉద్బోధిస్తూ, వాటి ప్రభావం వలన మనలోని ప్రాణాయామ, ఆస్త్మాలాంటి స్థితులన్నీ సరిపోతాయని అన్నారు.

❀ ❀ ❀

ది. 11.12.2005 ఆదివారంనాడు సాయంత్రం జరిగిన సత్సంగ, భజన కార్యక్రమాలలో భాగంగా, "సచ్చిదానంద" అనే మకుటంతో తాము రచించిన పద్యాలను పాడుతూ, నిత్యజీవితానికి సంబంధించిన వాటి అర్థాలను శ్రీస్వామీజీవారు అద్భుతంగా వివరించారు.

❀ ❀ ❀

విదేశీ క్రిస్టియన్ భక్తులు ది.22.12.2005 నాడు సాయంత్రం శ్రీస్వామీజీవారి సమక్షంలో క్రిస్టమస్ గీతాలను ఆలాపించి, ది.24.12.2005

నాడు సాయంత్రం విశ్వప్రార్థనా మందిరంలో క్రిస్టమస్ వృక్షాన్ని విద్యుద్దీపాల అలంకరణలతో అందంగా అలంకరించి, శ్రీబాలస్వామీజీవారి సమక్షంలో క్రిస్టమస్ గీతాలతో, క్రిస్టమస్ఈవ్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీబాలస్వామీజీవారు తమ ప్రసంగంలో దత్తాత్రేయస్వామివారి బోధలను, ఏసుక్రీస్తు బోధలను వివరించి, వారిద్దరి మధ్యగల సమన్వయాన్ని గురించి కూడా వివరించారు.

✿ ✿ ✿

ఈ సంవత్సరపు దత్తజయంతి ఉత్సవాలను ది.13.12.2005 నుండి 15.12.2005 వరకు దత్తపీఠంలో వేలాది భక్తుల సమక్షంలో విశేషంగా నిర్వహించడం జరిగింది. విశ్వప్రార్థనా మందిరంలో దత్తాత్రేయస్వామివారికి 13వ తేదీరోజు పంచామృతాభిషేకాన్ని, 14వ తేదీరోజు పాలాభిషేకాన్ని 15వ తేదీరోజు తైలాభిషేకాన్ని శ్రీస్వామీజీవారు నిర్వహించారు. 15వ తేదీరోజు నిర్వహించిన శ్రీచక్రపూజ, అభిషేక కార్యక్రమాలను ఉదయం 10 గం॥లనుండి 12 గం॥ల వరకు, ఈ.టీ.వీ. కన్నడ ఛానల్‌వారు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్షప్రసారం చేశారు. అనంతరం వేలాది మంది భక్తులు దత్తాత్రేయ ఉత్సవమూర్తికి శ్రీస్వామీజీవారి సమక్షంలో స్వయంగా తైలాభిషేకాన్ని నిర్వహించారు. 13వ తేదీరోజు సాయంత్రం దత్తాత్రేయస్వామివారి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకువెళ్ళి మండపోత్సవంలో భాగంగా నాదమంటపంలోని మండపంలో ప్రతిష్ఠించి, అర్చించారు. 14వ తేదీ రోజు సాయంత్రం రథోత్సవంలో భాగంగా, దత్తాత్రేయస్వామివారి ఊరేగింపును ఆశ్రమంలో నిర్వహించారు. 15వ తేదీరోజు సాయంత్రం ఆశ్రమంలోని సప్తర్షితీర్థంలో, కన్నుల పండువుగా జరిగిన దత్తాత్రేయస్వామివారి తెప్పోత్సవంలో శ్రీస్వామీజీవారు పాల్గొన్నారు. అనంతరం దత్తదేవాలయంలో శ్రీస్వామీజీవారు సప్తకీర్తనలతో కాగడాహారతిని విశేషంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో దత్తభజనలను శ్రీస్వామీజీవారు ప్రత్యేకంగా ఆలాపించారు. ది.16.12.2005 నాడు శ్రీస్వామీజీవారు భక్తులకు మంత్రోపదేశాన్ని అనుగ్రహించారు.

✿ ✿ ✿

ది.17.12.2005 నాడు సాయంత్రం దత్తకాశీ అని పిలువబడే శ్రీస్వామీజీవారి జన్మస్థలమైన మేకెదాటుకు శ్రీస్వామీజీ ప్రయాణమైనారు.

ది. 18. 12. 2005 నాడు అచ్చటి దేవాలయానికి నిర్మించిన నూతన ముఖమంటపాన్ని, నూతన నిర్మిత గణపతి, కార్యసిద్ధి ఆంజనేయస్వామి గుళ్ళను, పాదుకా మంటపాన్ని, వనదుర్గ మంటపాన్ని, దత్తదేవాలయానికి నిర్మించిన నూతన గోపురాన్ని ప్రారంభించి, గణపతి, పంచముఖ కార్యసిద్ధి ఆంజనేయస్వామి మూర్తులను ప్రతిష్ఠించి, ప్రతిష్ఠా హోమానికి పూర్ణాహుతి గావించి, ఈ ఆలయాలకు కుంభాభిషేకాన్ని మరియు దత్తదేవాలయానికి పునఃకుంభాభిషేకాన్ని, దాదాపు 2000 మంది హాజరు అయిన భక్తుల సమక్షంలో శ్రీస్వామీజీవారు నిర్వహించారు. ది. 18. 12. 2005 నాడు సాయంత్రం శ్రీస్వామీజీ మైసూరు ఆశ్రమానికి చేరుకున్నారు. 16వ తేదీరోజు మేకెదాటు చేరుకున్న శ్రీబాలస్వామీజీవారు కుంభాభిషేకంలో, దేవతామూర్తుల అభిషేకాలలో పాల్గొని 19వ తేదీరోజు మైసూరు చేరుకున్నారు.

❖ ❖ ❖

ది. 23. 12. 2005 నాడు మైసూరు నుండి బయలుదేరిన శ్రీస్వామీజీవారు ది. 24. 12. 2005 నుండి ది. 25. 12. 2005 వరకు బళ్ళారిజిల్లాలోని హోస్పేట్‌లో నిర్వహింపబడిన 3వ అంతర్జాతీయ భగవద్గీతా సమ్మేళనాన్ని ది. 24. 12. 2005 నాడు ప్రారంభించారు. ఈ సందర్భంలో శ్రీస్వామీజీ తమ ప్రసంగంలో, ఆధునికతపట్ల ఆకర్షితులై అందులో చిక్కుకు పోయిన భారతీయులు ప్రాచీన, సనాతన గ్రంథాల ప్రాముఖ్యతను గుర్తించలేక పోతున్నందుకు తమ ఆవేదన వ్యక్తంచేస్తూ, అలాంటివారి కోసం గీతాఫౌండేషన్‌వారి ఆధ్వర్యంలో ఉత్తమమైన గ్రంథాల ముద్రణకు పునరుజ్జీవనం కల్పించనున్నట్లు తెలియజేశారు.

ది. 25. 12. 2005 నాడు ఉదయం అత్యధిక దక్షిణ భారతదేశ భాగంతో విలసిల్లిన, విజయనగర సామ్రాజ్య వైభవానికి చిహ్నంగా మిగిలిన నాటి రాజధాని హంపిని సందర్శించి, మహమ్మదీయ రాజుల దండయాత్రలతో కొల్లగొట్టబడి, శిథిలావస్థలో మిగిలిన అచ్చటి అద్భుతమైన రాతికట్టడాలను, దేవాలయాలను వీక్షించి, యునెస్కోవారి ఆధ్వర్యంలో నిర్వహింపబడుచున్న ప్రాచీన ప్రాభావానికి గుర్తుగా మిగిలిన ఈ స్థలాన్ని ప్రతి భారతీయుడు కర్తవ్యదృష్టితో సందర్శించాలని శ్రీస్వామీజీ అన్నారు.

❖ ❖ ❖

గత 10 రోజులుగా ఆశ్రమంలో నిర్వహించబడిన, సంస్కృతభాషలో సంభాషణా శిబిరంయొక్క ముగింపు సమావేశ కార్యక్రమం

ది.01.01.2006 నాడు లక్ష్మీనర్సింహ కుటీరంలో జరిగింది. మైసూరులోని ఇతర 25 ప్రాంతాలలో కూడా నిర్వహింపబడిన శిబిరాలలోని విద్యార్థులు, శిక్షకులు, సంస్కృత పాఠశాలకు చెందిన అధ్యాపకులు దాదాపు 200 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శృంగేరిలో ప్రధానంగా సంస్కృతభాషకు సంబంధించి B.Ed. ట్రేనింగ్‌లో పాల్గొంటున్న, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20 మంది యువతీ యువకులు, వారికి లభించిన సెలవు రోజులలో ఈ సేవాకార్యక్రమాన్ని మైసూరులో నిర్వహించారు. సంస్కృతభాషను ప్రచారం చేసి రాష్ట్రభాషగా చేయాలన్నదే వారి సంకల్పం. హర్యానాకు చెందిన శ్రీరవీంద్ర ఆశ్రమంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. సేవచేయడానికి సంకల్పం ఉంటే ఈ రకంగా ఎన్నో విధాలుగా చేయవచ్చు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీబాలస్వామీజీవారు తమ ప్రసంగంలో, సంస్కృతభాష అభిమానులు అతి ప్రాచీన సంస్కృతభాషను తల్లిగా భావించి, ఈ భాష పోషణకు బద్ధకంకణులు కావాలని చెప్తూ, వచ్చే సంవత్సరం నుండి ఈ శిబిరాలు ఇంకా పెరుగాలని అభిలషిస్తూ, రామాయణం, భారతం, వేదాలు, ఇంకా ఇతర ముఖ్యపురాణాలు అన్నీ ఈ సంస్కృతభాషలోనే ఉన్నాయని తెలియచేస్తూ, సంస్కృతభాషను నేర్చుకుంటే జ్ఞానం లభిస్తుందని ఉద్బోధించారు. సంస్కృతభాషను మృతభాషగా గాకుండ, అమృతభాషగా చేయాలని అభిలషిస్తూ, సమ్యక్‌భాష అయిన సంస్కృతభాష పరిరక్షణకు దత్తుడిని ప్రార్థిస్తున్నాం అని కూడా శ్రీబాలస్వామీజీ అన్నారు.

✿ ✿ ✿

శ్రీమతి & శ్రీ పీసపాటి వెంకటసూర్యప్రకాష్‌రావుగార్ల పుత్రుడు
**చి॥సూర్యగజానన సాయికార్తికేయ**
ది.20.08.2005 శనివారంనాడు భీమవరంలో జన్మించినాడు.
**ఈ చిరంజీవిపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించు గాక!**

**భగవంతుడు సాకారుడా, నిరాకారుడా అని సంశయంలో పడవద్దు, ఆలోచించవద్దు. కేవలం ప్రార్థనా ఉపాసనలు చేయండి, శాంతితో జీవించండి.**
**– శ్రీస్వామీజీ.**

## స్తోత్రమాల కంఠస్థ పఠన పోటీకి సంబంధించిన నియమనిబంధనావళి

(1) 30 సంవత్సరములలోపు వయస్సు గలవారెవరైనా ఈ పోటీలో పాల్గొనవచ్చు.

(2) ఈ పోటీ 2006 మే 20వ తేదీ తరువాత శ్రీస్వామీజీవారి జన్మదినోత్సవాలలో భాగంగా, మైసూరు ఆశ్రమంలో నిర్వహించబడును. నమోదు చేసుకొన్న అభ్యర్థులకు, పోటీ జరుగు తేదీ, సమయము తరువాత తెలియపరచబడును. **ఈ పోటీకి ప్రవేశ రుసుము లేదు.**

(3) ఈ పోటీలో పాల్గొనువారు గురుగీత, భగవద్గీత, (స్తోత్రమాలలోని శ్లోకాలు మాత్రము), లలితా సహస్రనామం, శతశ్లోకీ రామాయణములలో క్షుణ్ణంగా, ఆమూలాగ్రంగా, పుస్తకంలోకి చూడకుండా శ్రీస్వామీజీవారు పాడిన సంగీతబాణీలోనే పాడగలిగి వుండాలి. అలాగే శ్రీస్వామీజీవారిచే రచింపబడిన ఏదైనా ఒక భజనను, దత్తస్తవము, సద్గురుస్తవము, అష్టలక్ష్మీస్తుతి, దత్తషోడశిలను తప్పనిసరిగా గానం చేయవలసి ఉంటుంది. వీటన్నింటినీ కలిగిన MP3 CD మరియు స్తోత్రమాల అనే పుస్తకము, మైసూరు ఆశ్రమ పుస్తక విక్రయ కేంద్రంలో లభ్యమవుతాయి.

(4) అభ్యర్థులు పరీక్షా సమయంలో పుస్తకములోనికి చూడరాదు.

(5) న్యాయనిర్ణేతలు లలితాసహస్రనామంలోని ఏ ఒక లైననైనా సూచించి అక్కడినుంచి చెప్పుమని అడుగవచ్చు. (ఉదా : మృగనాభి విశేషకా అని చెప్పిన వెంటనే, అభ్యర్థి, ముఖచంద్ర కళంకాభా అని ఆ లైను మొదటి నుండి చెప్పవలెను. లేదా న్యాయనిర్ణేతలు మృగనాభి విశేషకా నుండి ముందుకు చెప్పుమని అయినా అడుగవచ్చు. లేదా లలితాసహస్రనామంలో 35వ లైను నుండి చెప్పుమని అడుగవచ్చు). అటులనే భగవద్గీతలోని ఏ శ్లోకమునైనా చెప్పుమని అడుగవచ్చు. (ఉదా: సేనయోరుభయోర్మధ్యే అన్న వెంటనే, "అర్జున విషాదయోగః అని అధ్యాయం పేరు చెప్పి, ఆ శ్లోకాన్ని పూర్తిగా చెప్పవలెను.) గురుగీత, శతశ్లోకీ రామాయణాలలోని శ్లోకం సంఖ్య చెప్పి ఆ శ్లోకాన్ని చెప్పుమని అడుగవచ్చు. న్యాయ నిర్ణేతలు ప్రశ్నించిన తరువాత 10 సెకండ్ల సమయం లోపల అభ్యర్థి జవాబు చెప్పవలెను.

(6) దత్తపీఠంచే నియమింపబడిన న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం.

**(7) మొదటి బహుమతి అక్షరాల లక్ష రూపాయలు (రూ. 1,00,000/-)**
**రెండవ బహుమతి యాభైవేల రూపాయలు (రూ. 50,000/-)**
**మూడవ బహుమతి పాతికవేల రూపాయలు (రూ. 25,000/-) మాత్రమే కాక 9 ప్రోత్సాహక బహుమతులు ఒక్కొక్కటి రెండువేల రూపాయల (2000/-) చొప్పున కూడా ఇవ్వబడుతాయి.**

(8) ఒక తెల్లకాగితంపై పూర్తి పేరు, తండ్రిపేరు/ భర్తపేరు, వయస్సు, పుట్టిన తేది, ఫోన్ నంబరు, చిరునామ వ్రాసి, ఒక ఫోటో జతపరిచి, పోస్టు ద్వారా కానీ, వ్యక్తిగతంగా కానీ ఆశ్రమ మేనేజరు గారికి పంపవలెను. కవరుపైన "Stotramala Recitation Competition-May 06" అని వ్రాసి 2006 ఏప్రిల్ 15 లోపల అందేటట్లుగా పంపవలెను. ఆపై చేరిన దరఖాస్తులు అనుమతింపబడవు. **అన్నీ పూర్తిగా కంఠస్థం చేయగలిగినవారు మాత్రమే పోటీకి దరఖాస్తు చేయగలరు. లేనిచో శ్రీస్వామీజీవారి, న్యాయనిర్ణేతల సమయం వృథా అవుతుంది.**

(9) దరఖాస్తులు పంపవలసిన చిరునామా :

**మేనేజర్, శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమము, దత్తనగర్, మైసూరు - 570 025**

(10) ఇతర వివరములకు పై అడ్రస్‌కు వ్రాతపూర్వకముగా సంప్రదించగలరు. దయచేసి ఫోనులో సంప్రదించరాదు.

# శ్రీస్వామీజీవారి పర్యటనా పట్టిక

| | | |
|---|---|---|
| 24.01.2006 | మంగళ | రేగిడిలో దివ్యనాద చికిత్సా కచేరీ |
| 26.01.2006 | గురు | రిపబ్లిక్‌డే, విశాఖపట్నంలో దివ్యనాద చికిత్సా కచేరీ |
| 27.01.2006 to 30.01.2006 | శుక్ర – సోమ | పిఠాపురం ఆశ్రమంలో కార్యక్రమాలు |
| 31.01.2006 | మంగళ | ముక్కామల, అమలాపురం ల సందర్శనం |
| 01.02.2006 | బుధ | అమలాపురం-అద్దంకి |
| 02.02.2006 | గురు | **అద్దంకి ఆశ్రమంలో దేవాలయాల కుంభాభిషేకాలు**<br>సా॥ చీరాల ఆశ్రమంలో కార్యక్రమాలు |
| 03.02.2006 | శుక్ర | 10AM ఒంగోలులో కార్యక్రమాలు<br>6 PM నెల్లూరు ఆశ్రమానికి చేరుట |
| 04.02.2006 to 05.02.2006 | శని – ఆది | నెల్లూరు ఆశ్రమంలో కార్యక్రమాలు<br>**(ది.04.02.2006 నాడు రథసప్తమి)** |
| 06.02.2006 | సోమ | నెల్లూరు నుండి చెన్నై |
| 07.02.2006 to 08.02.2006 | మంగళ – బుధ | చెన్నై ఆశ్రమంలో కార్యక్రమాలు<br>**(08.02.2006 నాడు భీష్మైకాదశి)** |
| 09.02.2006 to 10.02.2006 | గురు – శుక్ర | నదుపళని మురుగన్ దేవాలయంలో కార్యక్రమాలు, **అచ్చెరపాకం ఆశ్రమంలోని దేవాలయాలకు 12వ సంవత్సర సంప్రోక్షణ కార్యక్రమాలు** |
| 11.02.2006 to 12.02.2006 | శని – ఆది | పాండిచ్చేరి ఆశ్రమంలో గురునిలయం, ప్రార్థనామందిరాల ప్రారంభోత్సవం |
| 13.02.2006 | సోమ | మైసూరు ఆశ్రమానికి చేరుట |
| 25.02.2006 | ఆది | నాదమంటపంలో వెంకటమఖి సంస్మరణ దినోత్సవం, త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు |
| **26.02.2006** | సోమ | మైసూరు ఆశ్రమంలో మహాశివరాత్రి ఉత్సవాలు |

**శ్రీస్వామీజీవారి కార్యక్రమములలో అనుకోకుండా మార్పులు జరుగవచ్చు. వివరాలకు ఆశ్రమ కార్యాలయమును సంప్రదించ మనవి. మైసూరు : 0821-2486486, 2480424**

**గమనిక : శ్రీబాలస్వామీజీవారు కూడా శ్రీస్వామీజీవారితోపాటు పర్యటనలో ఉన్నారు.**



5



6



7



8

BHAKTI MALA MONTHLY Regd News Paper - No 29690/76 January 2006
Registered with Dept. Of posts vide Regn. Nos.
KANNADA : KA/SK/MYS-97/2006-08: ENGLISH : KA/SK/MYS-95/2006-08 & TELUGU : KA/SK/MYS-96/2006-08
Licenced to post without Prepayment vide Licence Nos.
KANNADA : WPP-SK-3 : ENGLISH : WPP-SK-1 & TELUGU : WPP-SK-2



Printed and Published by Dr. A.N. Swarnaprasad for
Sri Bhakti Mala Trust, Mysore at Lakshmi Narasimha Mudrana
Sri Ganapati Sachchidananda Ashram, Mysore - 570 025 (India)